



ముక్కోటినీ మొక్కారు!





శేష శైల వాసా : (వరుసగా) ఆదిశేషువుపై భక్తులకు దర్శనమిచ్చిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి, శేషపాన్పుపై అమ్మవారితో దర్శనమిచ్చిన అన్నవరం సత్యనారాయణస్వామి .. ప్రత్యేక అలంకరణలో అప్పనపల్లి బాలబాలాజీ

ముక్కోటి దేవతలతో తరలివచ్చిన శ్రీమహా విష్ణువును జనకోటి మొక్కింది.. గోవిందా.. గోవింద.. నమో నారాయణ అంటూ స్వామిని భక్తజనం కొలిచారు.. శేష శైల వాసా శ్రీ వెంకటేశా అంటూ గీతాలు ఆలపించారు.. కనులారా స్వామిని తిలకించి కోర్కెలు తీర్చమని వేడుకున్నారు.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి.. వైష్ణవ ఆలయాలకు పెద్దఎత్తున భక్తజనం హాజరై క్యూకట్టారు.. అన్నవరం సత్యనారాయణ స్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాలకు శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో ఉత్తరద్వారంలో వైకుంఠవాసుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. పూలతో చేసిన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.. ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాలకవర్గాలు చర్యలు చేపట్టాయి.. - 6లో

పద్ధతి మార్చుకోకుంటే.. నే రోడ్డెక్కుతా!


పవన్‌కు బొట్టు పెడుతున్న మహిళ

కుర్రకారు..పోలీసులకు పవన్ హెచ్చరిక

- మీకూ నిద్రాహారాలు ఉండవు జాగ్రత్త
- ఈవ్‌టీజింగ్ చేస్తే తొక్కినారతీస్తా
- గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగాయి
- పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- ఇక నుంచి నెలకు 14 రోజులు ఇక్కడే
- పిఠాపురం నుంచే రాష్ట్రవ్యాప్త యాత్ర
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఈవ్‌టీజింగ్ అంటే నాకు చిరాకు. పద్ధతి మార్చుకోకుంటే తొక్కి నారతీస్తా. నేను గనుక రోడ్డు మీదకు వస్తే ఎవరికీ నిద్రాహారాలు ఉండవు. గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రివేళల్లో బైక్‌లపై విన్యాసాలు చేస్తున్నారు. చోరీలు అధికమయ్యాయి. పిఠాపురంలో పోలీసులు ఉదాసీనంగా ఉంటున్నారనే ఫిర్యాదులు అధికమయ్యాయి అంటూ పోలీసుశాఖ పని తీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిఠాపురానికి జాతీయస్థాయిలో పేరు తీసుకురావాలని ఉందని తెలిపారు. అదే సమయంలో పిఠాపురం నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని చెబుతూ ఫోన్ చూస్తూ పోలీసులపై వచ్చిన కొన్ని ఫిర్యాదులను చదివి వినిపించారు. కొద్దిరోజుల కిందట పిఠాపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోకి రాత్రి పూట ఇద్దరు వ్యక్తులు వచ్చి అక్కడ విద్యార్థులను బెదిరించి వారి వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు లాక్కుని పరారయ్యారని తెలిపారు. మెయిన్‌రోడ్డులో కత్తి చూపించి బెదిరించి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారని.. ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొందరు యువకులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ కేశవరావు పోలీసుల దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు. అయినా తగ్గకపోగా ఈవ్‌టీజింగ్ పెరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడపిల్లలను ఏడిపిస్తే మగతనం కాదనే విషయాన్ని యువకులు తెలుసుకోవాలని, మగతనం కావాలంటే సైన్యంలో చేరాలని హితవు పలికారు.తన నియోజకవర్గంలో ఈవ్‌టీజింగ్ అనే మాట ఇక వినపడకూడదని, ఆడపిల్లలను ఏడిపిస్తే తొక్కి నారతీస్తానని హెచ్చరించారు. పోలీసుస్టేషన్లలో లాయర్లు సెటిల్‌మెంట్లు చేయకూడదని పోలీసులకు హితవు పలికారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఏ అధికారిని నేను రికమెండ్ చేయలేదు. సుపరిపాలన ఇవ్వండి అని కోరానని తెలిపారు. అది జరగకపోతే నాలాంటి వారు వచ్చి రోడ్డు మీద తిరిగితే ఎవ్వరికి నిద్రాహారాలు ఉండవని హెచ్చరించారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, టీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు,కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయకుమార్ వార్డు కౌన్సిలర్ నల్లా రమణమ్మ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తదితరులు ఉన్నారు.

పిఠాపురం నుంచి యాత్ర ప్రారంభిస్తా..

స్టార్‌డమ్ వదులుకుని ఒకటిన్నర దశాబ్దంగా నలిగిపోయా.. ఆటుపోట్లు ఎదుర్కొన్నా.. ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి.. ఆ గాయాలకు పిఠాపురం ప్రజలు మందు పోశారని పవన్ తెలిపారు. మీరు చుక్కనీరు దొరక్క దాహంతో అలమటిస్తున్న వ్యక్తికి నీరందిస్తే ఎలా ఉంటుందో గెలుపు ద్వారా రుచి చూపించారు. 26 జిల్లాలు తిరగాలని అనుకున్నా. అయితే ఇంటిని శుభ్రం చేసిన తర్వాత రాష్ట్రం సంగతి చూద్దామని భావించి పిఠాపురం నుంచే తన యాత్ర మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తాను కొన్న స్థలంలోనే షెడ్లు వేసుకుని నెలలో 14 రోజులు ఇక్కడే ఉండి 54 గ్రామాలు వెళ్లి అందరినీ కలుస్తానన్నారు. ముందుగా ఉప్పాడ మత్స్యకార గ్రామాల నుంచి మొదలుపెడతానని పవన్ చెప్పారు.

50 నిమిషాలు స్టాల్స్ దగ్గరే..

పిఠాపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పవన్ రాకతో పిఠాపురంలో ముందుగానే సంక్రాంతి వచ్చేసింది. పిఠాపురం పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. హరిదాసు కీర్తనలు.. పిట్టదొరల కోతలు, మాటలు వింటూ, జంగమదేవర జోస్యాన్ని ఆసక్తిగా ఆలకించారు. మహిళతో సోది చెప్పించుకున్నారు. రథాలపేట అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో సరదాగా ముచ్చటించి భోగిపండ్లు వేశారు. గర్భిణులు కె.వరలక్ష్మి, ఏ.రమ్యలకు సీమంతం నిర్వహించి ఆశీస్సులు అందించారు. చేనేత జౌళిశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నేత, పట్టు చీరలు, జాంధాని చీరలను తిలకించి ప్రత్యేకంగా ఆరా తీశారు. గ్రంథాలయ సంస్థ పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. సుమారు 50 నిమిషాలకుపైగా స్టాల్స్ వద్ద గడిపారు. కుమారపురంలో ఉపాధిహామీ పథకం కింద రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీగోకులాన్ని ప్రారంభించారు.నాలుగు గోవులను రైతు యాతం నాగేశ్వరరావుకు అందజేశారు. ఇక్కడ నుంచే రాష్ట్రంలో 12,500 గోకులాలకు ప్రారంభోత్సవం చేశారు.


చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పవన్.. చీరల స్టాల్ పరిశీలన.. బుక్ చదువుతున్న పవన్


పవన్‌కు బొకే ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, సభలో అతిథులు


మేమంతా మీ వెంటే: పవన్ సభకు హాజరైన జనం



పన్ను పోటు!



10 నెలలకు 18 శాతమే పన్నుల వసూళ్లు

- మొత్తం రూ. 81.32 కోట్లు
- వసూలు చేసింది రూ.11.50 కోట్లు
- వసూలు చేయాల్సింది రూ.70 కోట్లు
- జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిర్లక్ష్యం
- అయినా పట్టని యంత్రాంగం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- పక్కదారి పడుతున్న నగదు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):పన్నుల వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది.. గతంలో పోటీపడి మరీ పన్నుల వసూళ్లు చేసేవారు. ప్రస్తుతం సిబ్బంది పెరిగినా పన్నుల వసూళ్లు మాత్రం మందగించాయి. సచివాలయ సిబ్బంది చేసే పని చాలా తక్కువ. అటువంటిది కనీసం పన్నులు వసూళ్లపై కూడా దృష్టి సారించడంలేదు. దీనికి జిల్లాలో పన్నుల వసూళ్లే ఒక ఉదాహరణ. ప్రతి ఏడాది మార్చి నుంచి మార్చికి పన్నుల వసూళ్లు లెక్కిస్తారు. మరో రెండు నెలల్లో మార్చి రాబోతుంది.ఇప్పటికి కేవలం 20 శాతం పన్నులు వసూళ్లు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఒకవైపు కలెక్టర్ పన్నులు నూరు శాతం వసూలు చేయాలంటూ అధికా రులకు ఆదేశాలు జారీ చేస్తున్నా పెడచెవిన పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామాలైనా,పట్టణాలైనా ప్రగతి సాధించాలంటే పన్నుల వసూళ్లు తప్పనిసరి..జిల్లాలో పన్నుల వసూళ్లు చూస్తే పని గాడి తప్పినట్టనిపిస్తుంది.జిల్లా వ్యాప్తంగా సుమారు 19 శాతం వసూలు కాలేదంటే పంచాయతీ అధికారుల అలసత్వం అర్థం చేసుకోవచ్చు.

18 శాతమే వసూలు..

జిల్లాలో రాజమహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లకు సంబంధించి 300 పంచాయతీల్లో సుమారు రూ.81,32,64,150లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.11.50 కోట్లు మాత్రమే వసూళ్లు చేయడం గమనార్హం.రాజమహేంద్రవరం డివిజన్ 147 గ్రామాల్లో రూ.50,94,276 కొవ్వూరు డివిజన్ 153 గ్రామాలకు రూ.16.29 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.వసూలు చేసింది సగటున 18 శాతం మాత్రమే.వచ్చే రెండు నెలల్లో సుమారు రూ.70 కోట్ల వరకూ వసూలు చేయాల్సి ఉంది.జిల్లాలో భవన నిర్మాణాలు పూర్తయినా ఇంకా పన్నులు వేయకుండా ఉన్న భవనాలు వేలల్లో ఉన్నట్టు సమాచారం.జిల్లా కలెక్టరేట్ ఉన్న రాజమహేం ద్రవరం రూరల్ పరిధిలోనే పదుల సంఖ్యలో భవనాలకు చాలా ఏళ్లగా పన్నులు లేవంటే అతిశయోక్తి కాదు.

కలెక్టరేట్ పరిధిలోనూ ఇంతే..

జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయాల్సిన పన్నులు ఏరియర్స్ కలిపి రూ.80 కోట్లకు పైబడి ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోనే ఏరియర్స్‌తో కలిపి మొత్తం రూ.29.13 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 22.28 శాతం అంటే రూ.6.50 కోట్లు మాత్రమే వసూలు చేశారు.ఇంకా సుమారు రూ.22.65 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా వసూలు చేసిన పన్నులు ఎప్పటికప్పుడు పంచాయతీ ఖాతాలో జమ చేసి నగదు పుస్తకంలో నమోదుచేయాలి.పంచాయతీల పనులకు వినియోగించాల్సి వస్తే సీఎఫ్ఎంఎస్ ద్వారా మాత్రమే చెల్లింపులు జరగాలి.చాలా పంచాయతీల్లో నగదు చెల్లింపులు చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీల్లో పన్నుల ద్వారా వసూ లైన సొమ్మును జమ చేయకుండా కార్యదర్శుల వద్దనే ఉంచుకొని వసూలు కానట్టు చూపిస్తూ మార్పింగ్ నివే దికలు ఇస్తున్నారన్న వాదన ఉంది.కలెక్టర్ చొరవ తీసు కొని పంచాయతీల్లో నగదు పుస్తకం(క్యాష్ బుక్)తో పాటు బిల్డింగ్ ప్లాన్ రిజిస్టర్లు పరిశీలించేలా చర్యలు చేపడితే అవకతవకలు బయటపడడంతో పాటు ప్రభుత్వానికి అదనంగా ఆదాయం చేకూరుతుందని పలువురు అంటున్నారు.

విద్యుత్ నియంత్రణ మండలికి సమస్యలు ఏకరువు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో శుక్రవారం విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. స్థానిక ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజలు సమస్యలు ఏకరవు పెట్టారు. విద్యుత్ శాఖను ప్రైవేటీకరణ చేయవద్దన్నారు.విద్యుత్ తయారు చేయడానికి పెరిగే ఖర్చు ప్రకారమే బిల్లు రేట్ పెంచాలన్నారు.వై.వీరభద్రరావు మాట్లాడుతూ కడియం నర్సరీలకు పూర్తిస్థాయిలో సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. ఎక్కడా సమస్యల్లేకుండా 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వీటన్నింటిని ఛైర్మన్ ఇన్ చార్జి ఠాకూర్ రామసింగ్ పరిగణంలోకి తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ తిలక్‌కుమార్,ఈఈలు వీవీకి షోర్, నక్కపల్లి శామ్యూల్, దాట్ల శ్రీధర్ వర్మ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల తర్వాత ఎండోమెంట్ భూమి స్వాధీనం

- తూర్పుగోనగూడెంలో 25.16 ఎకరాలు
- రూ. 78 లక్షల శిస్తు బకాయిపడిన రైతు

రాజానగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల తరువాత ఎండోమెంట్ అధికారులు దేవాదాయ భూమిని స్వాధీనం చేసుకున్నారు. రాజానగరం మండలం తూర్పుగోనగూడెం గ్రామ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రానికి సంబంధించి సర్వే నెంబరు 20,27,28,135లలో 25.16 ఎకరాలు భూమి ఉంది.ఆ పొలాన్ని రాజానగరానికి చెందిన ముత్యాల సత్యనారాయణ కుటుంబీకులు వందేళ్లగా కౌలు వ్యవసాయం చేస్తున్నారు. నామమాత్రపు లీజులు చెల్లించకపోవడంతో ఇప్పటి వరకు రూ.78 లక్షలు బకాయిలు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. లీజు బకాయిలు చెల్లించాలంటూ అధికారులు ఎన్నిమార్లు నోటీసులు జారీ చేసినా ఖాతరు చేయకుండా కోర్టులను ఆశ్రయిస్తూ సదరు భూమిపై వస్తున్న లక్షలాది రూపాయల ఆదాయాన్ని అన్యాయంగా దోచుకుంటున్నారని అధికారులు చెప్పారు. ఈ మేరకు అధికారులు, పోలీసుల సమక్షంలో జిల్లా దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు శుక్రవారం సదరు భూమిని గ్రామ పెద్దలు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీదారు టీటీఎస్ఆర్.ప్రసాద్, అన్నదాన సత్రం కార్యనిర్వహణాధికారులు డి.సురేష్‌బాబు, రాంబాబు రెడ్డి, ఎండోమెంట్ అధికారులు,రాజానగరం ఎస్ఐ మనోహర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి 147 ఎకరాల భూమి

శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లో 147 ఎకరాలు విలువైన పంట భూములు ఉన్నాయి. లీజు సొమ్ములు ఎగవేస్తున్న వారి నుంచి వీలైనంత త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. - **నాగేశ్వరరావు, జిల్లా దేవదాయశాఖాధికారి**


భూమిని స్వాధీనం చేసుకున్న ఎండోమెంట్ అధికారులు

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన సత్యదేవుడు



ఉత్తర ద్వారంలో సత్యదేవుడు, అమ్మవార్లను దర్శించుకుంటున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఈవో సుబ్బారావు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వెండి రథంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- తొలి దర్శనం చేసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు దంపతులు



అన్నవరంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

అన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రత్నగిరివాసుడైన సత్యదేవుడు శేషతల్పంపై శయనిస్తున్న శ్రీమహావిష్ణువు గాను, దేవేరి అనంతలక్ష్మి అమ్మవారు ఆయన పాదాలను సుతిమెత్తగా ఒత్తుతున్న లక్ష్మీదేవిగా భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, ప్రత్యేక పూజల అనంతరం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో దంపతులు తొలి దర్శనం చేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల సంఘటన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈవో వీర్ల సుబ్బారావు స్వీయ పర్యవేక్షణలో క్యూలైన్లలోనే భక్తులను, స్థానికులను, ఉద్యోగుల కుటుంబసభ్యులను అనుమతించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్, ఎస్పీ పలుమార్లు ఈవోకు ఫోనులో సూచనలిచ్చారు. పుష్పాలంకరణలు, నేలపైనుంచే శేషతల్పం తూర్పు రాజగోపురం పక్కన నమూనా ఆలయం సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కోలాటం, భరతనాట్యం ప్రదర్శనలు అలరించాయి. ఉదయం పదకొండు గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఆశీనులు గావించి తూర్పు రాజగోపురం చుట్టూ సేవ నిర్వహించగా ఈవో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.



కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముక్కోటి... భక్త కోటి



వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న మంత్రి సుభాష్ (పైన) కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు (కింద)



వాడపల్లిలో వైభవంగా వైకుంఠ ఏకాదశి

ఆత్రేయపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశినాడు భక్తులతో శోభిల్లింది. వేకువజామునే గోదావరి జలాలతో స్నపనమూర్తులకు అభిషేకించి జరిపి తిరుప్పావై పారాయణం నిర్వహించారు. ఉత్తరం వైపున పుష్పాలతో అలంకరించిన సప్తద్వారాల ద్వారా శేషపాన్పుపై విహరించిన స్వామివారిని భక్తులు కనులారా దర్శించుకుని తన్మయత్వం పొందారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టీడీపీ నేతలు కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వాడపల్లి క్షేత్రాన్ని ఫల, పుష్ప విద్యుత్ కాంతులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ రాము ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో...

మామిడికుదురు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన మండపంలో స్వామివారు ఉభయ దేవేరులతో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదాదేవికి నిర్వహించిన లక్ష చామంతి పూజలో అధిక సంఖ్యలో భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జాయింట్ కలెక్టర్ నిషాంతి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు.

45 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

- సీనియర్ అసిస్టెంట్‌లకు అవకాశం
- కాకినాడ జిల్లాలో 10
- తూర్పుగోదావరి జిల్లాలో 10
- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 12
- అల్లూరి జిల్లాలో 13
- ఉత్తర్వులు వెలువరించిన జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లాలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న 45 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ తహసీలార్లుగా పదోన్నతి పొందారు. ఈమేరకు శుక్రవారం ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి, కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు వెలువరించారు. కాకినాడ జిల్లాకు 10, తూర్పుగోదావరి జిల్లాకు 10, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 12, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 13 మంది డిప్యూటీ తహసీల్దార్లను కేటాయించారు. సంక్రాంతి నేపథ్యంలో వరుసగా ఐదురోజుల సెలవులు రావడంతో ఈనెల 16వ తేదీ నుంచి వీరు విధుల్లోకి చేరే అవకాశంఉంది. ఖాళీగా ఉన్న డిప్యూటీ తహ సీల్దార్ల పోస్టులు భర్తీ చేయడంతో ఉద్యోగులు హర్షంవ్యక్తం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

పెద్దాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నవోదయ ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, 8971 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకూ పరీక్ష నిర్వహిస్తామని, ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల న్నారు. ఆన్‌లైన్‌లో తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. సమా చారం కోసం 9441008830, 9440419142లో సంప్రదించాలని కోరారు.

16న ఐటీఐ అప్రెంటీస్‌షిప్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 16వ తేదీ ఉదయం 9గంటలకు అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానాధికారి కృష్ణన్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో పీఎంఎన్ఏఎంమేళా నిర్వహిస్తున్నామన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

దివ్యాంగుల మోముల్లో సంక్రాంతి కాంతులు

- అనాధాశ్రమ పిల్లలకు ప్రైవేట్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేసిన మంత్రి సుభాష్
- స్వయంగా వెళ్లి వారితో కలిసి షాపింగ్



దివ్యాంగులతో కలిసి దుస్తులు కొనుగోలు చేస్తున్న మంత్రి సుభాష్



రామచంద్రపురంలో రిలయన్స్ ట్రెండ్స్‌వద్ద దివ్యాంగులతో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వారంతా దివ్యాంగులు.. మనోవైకల్యం, అంధత్వం, బధిరులు, శారీరక వైకల్యం ఇలా వైకల్యంతో జీవితం గడుపుతున్న బాలబాలికలు, యువతీ యువకులు.. కొంతమంది అనాథలు, మరికొంతమంది తల్లి లేదా తండ్రి మాత్రమే ఉన్నవాళ్లు. వీరంతా డాక్టర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం పట్టణంలో జోయ్ మినిస్ట్రీస్ బేతస్థ న్యూలైఫ్ సెంటర్‌లో దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్నారు. వీరి ముఖాల్లో సంతోషం.. సంక్రాంతి పండుగ ఘడియలు సమీపిస్తున్న వేళ వీరి జీవితాల్లోను ఆనందగడియలు నింపారు మంత్రి సుభాష్.

బస్సులో రిలయన్స్ టెండ్స్‌కు..

మంత్రి సుభాష్ ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు దివ్యాంగుల పాఠశాలలో ఉన్న పిల్లలు, సిబ్బందిని రిలయన్స్ ట్రెండ్స్‌కు పంపాలని బస్సు పంపించారు. దీంతో వీరంతా టూరిస్టు బస్సు ఎక్కి బయలుదేరారు. మార్గమధ్యలో మంత్రి సుభాష్ బస్సు ఎక్కారు. మెయిన్‌రోడ్డులో ఉన్న ట్రెండ్స్‌కు చేరుకున్నారు. దివ్యాంగులతో కలిసి మంత్రి సుభాష్ రిలయన్స్ టెండ్స్ షాపింగ్‌మాల్‌లోకి ప్రవేశించారు.

నచ్చిన దుస్తులు ఎంపిక చేసుకోమని..

దివ్యాంగులు లైట్లు మిరమిట్లు గొలుపుతున్న ట్రెండ్స్‌లో ప్రవేశించి ఆశ్చర్యానికి లోనయ్యారు. మంత్రి సుభాష్ దివ్యాంగులను మీకు నచ్చిన దుస్తులు ఎంపిక చేసుకోండి అని చెప్పారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మంత్రి సుభాష్ వారితో కలిసి దుస్తులు ఎంపిక చేశారు. మొత్తం 65మంది పిల్లలు, 8మంది సిబ్బందికి దుస్తులు కొనిచ్చారు మంత్రి సుభాష్. రెండుగంటలపాటు దివ్యాంగులతో కలిసి మంత్రి షాపింగ్ చేయడంతో ఇటు దివ్యాంగులు, షాపింగ్‌మాల్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పాఠశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఖండవిల్లి దుర్గాదేవికి వికాస డైరెక్టర్‌తో మాట్లాడి ఉద్యోగం ఏర్పాటు చేశారు. దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు అలెగ్జాండర్, ప్రిస్కిల్లా దంపతులను మంత్రి సుభాష్ అభినందించారు.

జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు కరప విద్యార్థిని ఎంపిక



కరప, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బోగిరెడ్డి పావనిశ్రీ మణిచంద్రిక జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 10నుంచి 13వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే 69వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో పావని రాష్ట్రజట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుందన్నారు. తన మెరుగైన ఆటతీరుతో ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం దక్కించుకున్న పావనిశ్రీను, తర్ఫీదు నిచ్చిన పాఠశాల పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్‌లను హెచ్‌ఎంతో బాటు ఎస్ఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, ఉపాధ్యాయులు మారిశెట్టి రమేష్, బి.స్వర్ణరాణి, టేకుమూడి శ్రీనివాస్, పి.సరోజ, కేఎస్ఎన్ మూర్తి, తదితరులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభచూపాలని ఆకాంక్షించారు.

సతీష్‌బాబును కలిసిన క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డి



సతీష్‌బాబును కలిసి మొక్క అందజేస్తున్న క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డి

కాకినాడసిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో జరిగిన అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచిన విశాఖపట్నంనకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు నితీష్ కుమార్ రెడ్డి శుక్రవారం విశాఖలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, ఏసీఏ గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు నితీష్ కుమార్ రెడ్డిని అభినందించి ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి

- స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌కు సీఆర్ఎంటీల వినతి

ప్రత్తిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీసీఆర్పీడబ్ల్యుఏ రాష్ట్ర నేతలు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహంకు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఏపీసీఆర్పీడబ్ల్యుఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ బృందం శుక్రవారం విజయవాడ విద్యా భవన్‌లో అబ్రహంను కలిసి వినతిపత్రం అందజేసింది. ఐదేళ్లుగా జీతాల పెంపుదల లేక సీఆర్ఎంటీలు ఇబ్బందిపడుతున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు వివరించారు.



జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్, అతిథులు

గణిత వ్యూహాలపై ఓరియంటేషన్

- ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వర్శిటీ అలూమ్ని ఆడిటోరియంలో గణిత ఉపాధ్యాయులకు కాకినాడజిల్లా పాఠశాల విద్యాశాఖ, ఏపీ మ్యాథ్స్‌ఫోరం(ఏపీఎంఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో గణిత వ్యూహాలపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ మ్యాథ్స్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.జోగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగానూ, డీఈవో పి.రమేష్, ఎస్ఎస్ఏ సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఏపీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, సలహాదారులు మల్లిఖార్జున గణితావధాని టి.సాయిరామకృష్ణ, రవిశంకర్ అతిథులుగా పాల్గొన్నారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతీవిద్యార్థికి మొదటి గురువు గణిత ఉపాధ్యాయుడేనన్నారు. స్టెమ్‌కోర్సులలో గణితం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. పదో తరగతిలో విద్యార్థులు గణితంలో నూరు శాతం మార్కులు సాధించేందుకు అవలంబించాల్సిన అంశాలను రీసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సంక్రాంతి విశిష్టతను భావితరాలకు అందించాలి

- ఏపీఎస్పీలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న కమాండెంట్ దీపిక



మట్టి కుండపై పరమాన్నం తయారు చేస్తున్న కమాండెంట్ దీపిక



హరిదాసు శ్రీరామ కీర్తనలు వింటున్న కమాండెంట్ దీపిక

సర్పవరం జంక్షన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసే విధంగా సంక్రాంతి పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.దీపిక అన్నారు. శుక్రవారం రమణయ్యపేట ఏపీఎస్పీ ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా భోగిమంటలు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిదాసు, గోదాదేవి, కృష్ణుడు, సోదమ్మ, బుడబుక్కలోడు, కొమ్మదాసరుడు వంటి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆంధ్ర పేపరు మిల్లులో ఏం జరుగుతోంది?



ఇటీవల పేపరు మిల్లు గేటుకు అంటించిన లాకౌట్ నోటీసు

- మనుగడకు ముప్పు వాటిల్లే ఘంటికలు
- కార్మిక క్షేమం పట్టని ఈడీ ముఖేష్ జైన్
- వేతన ఒప్పందాలు లేకుండా వ్యవహారం
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- పరంపర-2 పేరుతో ఉద్యోగాల అమ్మకాలు
- పెచ్చుమీరిన దాష్టీకాలు
- మహిళా ఉద్యోగిని లోబర్చుకుని మోసం
- ఇటీవల పేపర్‌మిల్లు లాకౌట్.. ఆరోజే ఎత్తివేత కూడా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రతిష్టాత్మకమైన ఆంధ్ర పేపరుమిల్లు లిమిటెడ్‌లో ఏం జరుగుతుందో కానీ.. దాని మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాద ఘంటికలు మోగు తున్నాయి. ఏ కంపెనీ అయినా తన అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమం చూడాలి. ఒకపక్క మిల్లు కెపాసిటీ విస్తరిస్తూ మరోపక్క కార్మికులపట్ల యాజమాన్య కుట్రలు, యాజమాన్యం తరపున ఇక్కడ వ్యవహారాలు చక్కపెడుతున్న వారి దాష్టీకంతో మిల్లు ప్రతిష్ట దిగజారిపోతోంది. ఇటీవల పేపర్‌మిల్లుకు లాకౌట్ ప్రకటించగా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల చొరవతో లాకౌట్ ప్రకటనను ఆరోజు సాయంత్రానికే విరమించుకున్నారు. ఈ నేపథ్యంలో లోపల ఏం జరుగుతోందో తెలుసుకుందాం..

2019 వరకు యాజమాన్యాలు మారినా కార్మికుల సంఘాలు పటిష్టంగా ఉండడంతో మిల్లుకు ఇబ్బంది కలగలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేపరుమిల్లు యాజమాన్య వైఖరిలో మార్పు వచ్చింది. దాష్టీకాలు పెరిగాయి. ఉన్నతస్థానాల్లో ఉన్న తెలుగు ఉద్యోగులు 70మంది ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపో యారు. వారి స్థానాలు నార్త్ ఇండియాకు చెందినవారితో నిండిపోయాయి. మూడున్నరేళ్లకోసారి జరిగే వేతన ఒప్పందానికి తూట్లు పొడవంతోపాటు, సీనియార్టీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల పదోన్నతులు ఆపేశారు. పర్మినెంట్ ఉద్యోగులను ప్రలోభ పెట్టి వారు ఉద్యోగాలు వదిలేసుకునేలా చేసి వాటిని ఏ విధమైన అనుభవం లేనివారికి అమ్ముకునే స్థాయికి ఫ్యాక్టరీ నిర్వాహకులు చేరారు. యాజమాన్య దాష్టీకానికి ఇద్దరు ఉద్యోగులు బలైపోయారు. పరంపర-2 పేరుతో మోసపోయిన ఓ పర్మినెంట్ ఉద్యోగి పేపరుమిల్లులోనే సూసైడ్ చేసుకున్నాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబుతో ఫ్యాక్టరీ సమస్యలపై చర్చించగా ఓ ఉన్నతస్థాయి కమిటీ నియామకానికి ఆదేశించిన సంగతి తెలిసిందే. కానీ యాజమాన్య మొండి వైఖరిని తట్టుకోలేక ఈ నెల 2వ తేదీ నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. వాళ్లను బెదిరించడానికి ఆదివారం అర్ధరాత్రి తర్వాత నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. కూటమి నాయకులు రంగంలోకి దిగడంతో యాజమాన్యం లాకౌట్ విరమించింది.

● ముఖేష్ జైన్ దాష్టీకాలు

మిల్లు ఆరంభం నుంచి యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య మూడున్నరేళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతుంది. ఈ సమయంలో పర్మినెంట్ ఉద్యోగులకు జీతాలు పెంచడం పదోన్నతులు ఇవ్వడంతోపాటు, కాంట్రాక్టు కార్మికుల సీనియార్టీని పరిగణించి వారిని పర్మి నెంట్ చేయడం ఆనవాయితీగా వచ్చేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ ఏడాది జూలై నుంచి డిసెంబరు 23 మధ్యలో రాబోయే మూడున్నరేళ్లకోసం ఒప్పందం జరగాలి. ఈ వేతన ఒప్పందానికి యాజమాన్యంతో కుమ్మక్కయిన ముఖేష్ జైన్ గండి కొట్టారు. కీలక స్థానాల్లో ఉన్న తెలుగు ఉద్యోగులపై పగ పట్టినట్టు వ్యవహరించడంతో 60నుంచి 70మంది ఉద్యోగాలు మానేసి వెళ్లిపోవడం గమనార్హం. తన మాట వినే వాళ్లను మాత్రం కొంతమందిని దగ్గర చేర్చుకున్నాడు. తన ఇంట్లో పనిచేసే వ్యక్తుల భార్యలకు ఒకరికి స్టోర్‌లో, మరొకరికి హెచ్‌ఆర్‌లోనూ ఉద్యోగులివ్వడం గమనార్హం. అతని బాధలు తట్టుకోలేక కమల కిశోర్ బ్రెయిన్ ట్యూమర్, విజయ్ అనే సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి గుండె పోటుతో మృతిచెందినట్టు సమాచారం. పరంపర-2 పేరుతో ఉద్యోగాలిస్తామని వేరేవాళ్ల దగ్గర డబ్బు తీసుకుని ఉద్యోగం ఇవ్వకపోవడంతో తట్టు కోలేక పర్మినెంట్ ఉద్యోగి ఎస్.సత్యనారాయణ పేపరు మిల్లులోనే సూసైడ్ చేసుకున్నాడు. దీనిపై కూడా కేసు నమోదైంది. తర్వాత ఓ రాజకీయ నేత సహకారంతో రూ.23 లక్షలకు బాధిత కుటుంబంతో ఒప్పందం పెట్టుకు న్నట్టు సమాచారం. ఇక్కడ టీఎన్‌టీయూసీ నేతగా ఉన్న ప్రవీణ్ చౌదరిని లోబర్చుకుని అతన్ని వైసీపీ నేతలకు దగ్గరయ్యేలా చేసి అతనితో కోర్టులో కేసు వేయించి ఒప్పందంలో జాప్యం జరిగేలా ప్రయత్నం జరిగింది. తర్వాత అతను కేసు తీసేసు కున్నా కార్మికులు అడిగిన రూ.10,500 వేతన పెంపు ఒప్పందానికి అంగీకరించకుండా యాజమాన్యం హైకోర్టులో కేసు వేసింది. తర్వాత పరంపర-2 పేరుతో సీనియర్లు అయిన పర్మినెంట్ ఉద్యోగులకు కొంత డబ్బు ఆశచూపి వారిని ఉద్యోగ విరమణ చేయించాడు. వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులను సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయకుండా, అసలు పేపరుమిల్లుతో సంబంధం లేని సుమారు 150మంది వద్ద రూ.8లక్షల నుంచి రూ.20లక్షల వరకూ ఒకొక్కరి వద్ద తీసుకుని వారికి ఉద్యోగా లివ్వడం గమనార్హం. పైగా వారికి కూడా కనీస వేతనం రూ.11,500 వరకూ మాత్రమే. అదీ పూర్తిగా రాదు. ఇలా కార్మికులను, వారి కుటుంబాలను నిలువునా ముంచేశారు.

ఎంతో చరిత్ర గల పేపరుమిల్లు

రాజమండ్రిలో 1912లో బ్రిటీష్‌వాళ్లు కార్నాటిక్ పేపరుమిల్లు లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేశారు. 1929లో ఆంధ్ర పేపరుమిల్లు లిమిటెడ్‌గా మారింది. 1953లో మద్రాసు నుంచి విడిపోయి ఉమ్మడి ఆంధ్ర ఏర్పడిన తర్వాత ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుంది. రోజుకు 10 టన్నులు ఉత్పత్తి లక్ష్యంగా ఉండేది. 1964లో ప్రైవేట్ భాగ స్వామ్యం వచ్చింది. 2011లో అమెరికా కంపెనీ ఇంటర్నేషనల్ పేపరు చేతిలోకి వెళ్లింది. 75 శాతం వాటా వాళ్లకు దక్కింది. మిగతా ప్రభుత్వ వాటాగా ఉంది.2019లో కర్నాట కకు చెందిన వెస్ట్‌కోస్ట్ పేపరుమిల్లు లిమిటెడ్ (డబ్ల్యుసీపీఎం)కు చెందిన ఎస్.ఎన్ బంగూరీ కొన్నారు. తర్వాత దానికి ఈడీగా, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా రాజస్థాన్‌కు చెందిన ముఖేష్ జైన్ నియమితులయ్యారు. అక్కడ నుంచి ఈ మిల్లుకు కష్టాలు ఆరంభమయ్యాయి. ఇక్కడ పర్మినెంట్ వర్కర్లు సుమారు 800, పర్మినెంట్ ఉద్యోగులు 550 వరకూ ఉండగా, కాంట్రాక్టు కార్మికులు సుమారు 2 వేలమంది ఉన్నారు. ప్రస్తుతం రోజుకు రూ.5 కోట్ల టర్నో వర్‌గా ఉంది.ఏడాదికి రూ.2 వేల కోట్ల టర్నోవర్‌తో పేపరుమిల్లు నడుస్తోంది.

ఎన్నికల ముందు నాటకం

గత సార్వత్రిక ఎన్నికల ముందు నాటకీయంగా యాజమాన్యం వ్యవహరించింది. కార్మికులంతా సమ్మెలో ఉండడంతో పాటు వైసీపీకి వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఏమైందోకానీ అప్పటి కలెక్టర్ మాధవీలతను రంగంలోకి దింపి వేతన ఒప్పందం చేసుకునేటట్టు హామీఇచ్చారు. ఎన్నికలు పూర్తయినా యాజమాన్య వైఖరి మారక పోవడంతో ఇటీవల కార్మిక సంఘ నేతలు తెలుగుదేశం కూటమి నేతలను ఆశ్రయించారు. వారితో పాటు ప్రస్తుత కలెక్టర్ పి.ప్రశాంతి కూడా యాజమాన్యంతో చర్చలు జరపడంతో కేవలం రూ.3,500 మాత్రమే పెంచుతానని యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడంతో సమస్య జఠిలమైంది.

● అరెస్ట్ చేయని పోలీసులు

ఈడీ ముఖేష్ జైన్ సెక్యూర్టీ గార్డుగా పనిచేస్తున్న ఒక మహిళను ప్రలోభపెట్టి మోసం చేసినట్టు గత నవంబరులో సదరు మహిళ పోలీసులను ఆశ్రయించింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని ఇంతవరకూ అరెస్ట్ చేయలేదు. ముఖేష్ రాజమహేంద్రవరం నుంచి పరారై హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో నుంచి ఇక్కడ పేపరుమిల్లు వ్యవహారాలు చక్కపెడుతుండడం గమనార్హం. ఆయన ఫోన్ కూడా పనిచేస్తుందని అందరూ చెబుతున్నారు. కానీ బొమ్మూరు పోలీసులకు మాత్రం ఆయనను అరెస్ట్ చేసే తీరిక లేకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● సీఎం చంద్రబాబుతో కూటమి నేతల భేటీ

పేపరుమిల్లును కాపాడుకోవడంకోసం ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ ఇటీవల సీఎం చంద్రబాబును కలసి సమస్యను వివరించగా ఆయన యాజమాన్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వైసీపీ వల్లే అధ్వానంగా ఏడీబీ రోడ్డు

- ● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ● ఏడీబీ రహదారి విస్తరణ పనుల పరిశీలన



రంగంపేట మండలం ఎస్టీరాజాపురం వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

రంగంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏడీబీ రోడ్డు పనులను పటించుకోనందువల్లే అధ్వానంగా తయారైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. శుక్రవారం పిఠాపురం పర్యటకు వచ్చిన ఆయన మధురపూడి విమానాశ్రయం నుంచి రాజానగరం, రంగంపేట మీదుగా ఏడీబీ రోడ్‌లో పిఠాపురం బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా వేమగిరి వద్ద గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వడిశలేరు గ్రామంలోని కార్గిల్‌ఫ్యాక్టరీ వద్ద ఏడీబీ రోడ్‌లో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన తోకాడ చరణ్, ఆరవ మణికంఠ ప్రమాదానికి గురై మరణించిన సంఘటనా స్థలాన్ని పవన్ పరిశీలించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏడీబీ రహదారి విస్తరణ పనులను పరిశీలించి, సమగ్ర వివరాలను తెలుసుకున్నారు.

రాజానగరం నుంచి సామర్లకోట ఏడీబీ రోడ్డు నాలుగులైన్లు విస్తరణ రహదారి పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పనుల పురోగతి, తదితర అంశాలపై వివరించారు. నాలుగులైన్లు రహదారిగా అభివృద్ధికి చెందిన 30 కిలో మీటర్లలో 16.29 కిలో మీటర్లు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉందని, ఇందునిమిత్తం 189 కోట్ల, 87 లక్షల రూపాయిల ప్రాజెక్టు అంచనాతో పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. 2017 అక్టోబరులో పనుల చేపట్టగా 2021 ఫిబ్రవరిలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులను 2025 ఆగస్టు నాటికి పూర్తి చేసేలా ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు అనుమతి ఇచ్చిందని, ఆ మేరకు పనులను పూర్తి చేసే క్రమంలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లా పరిధిలో ఉన్న రూట్‌మ్యాప్ ప్రకటనలో గ్రామాల వారీగా పనుల పురోగతిని కలెక్టర్ వివరించారు. పరిహారం చెల్లింపులకు చెందిన బిల్లులు అప్లోడ్ చేసినట్టు తెలిపారు. ఎస్టీరాజాపురం వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పవన్ పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, డీఎస్పీ భవ్యకిషోర్, ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అయితే ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గం ఎప్పుడు వెళ్లినా సరే ఏడీబీ రోడ్డు మీదుగానే వెళతానని పవన్ చెప్పిన విషయం అందరికీ తెలిసినదే. మాట ప్రకారమే శుక్రవారం ఏడీబీ రోడ్డు మీదుగానే ఆయన పిఠాపురం వెళ్లారు.

గోదావరిలో అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్

- బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ
- ఏమీ చేయలేని పరిస్థితిలో అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అధికారికంగా ఎటువంటి అనుమతులు ఇవ్వనప్పటికీ, రాత్రి వేళ ఇష్టానుసారం ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో కూటమికి చెందిన వారే విచ్చలవిడిగా ఇసుక దోపిడీ చేయడం గమనార్హం. రాజమహేంద్రవరం వైపు గాయత్రీ, కోటిలింగాల, కొవ్వూరు వైపు కొవ్వూరు నుంచి వాడపల్లి, అరికరేవుల తదితర ప్రాంతాల్లో నిబంధనలకు తూట్లు పొడిచి, ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అధికారులు ఎంత కఠినంగా వ్యవహించాలని చూసినా వారిని ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు చేయగలిగిందని కొంతవరకూ ఇసుక కొరత లేకుండా చేయడమే. అక్రమాలను మాత్రం ఆపలేకపోతున్నారు. బోట్స్‌మన్ సొసైటీలంటే కేవలం పడవల మీద ఇసుక తీసే కార్మికులకే ఇవ్వాలి. వారి ఉపాధికోసమే ఈ పని అప్పగించాలి. కానీ వేరే రాష్ట్రాల నుంచి కార్మికులను తక్కువ కూలీకి తెచ్చి పనిచేయించుకోవడంతోపాటు స్థానిక కార్మికుల పొట్టకొడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా లారీకి రూ.3వేల నుంచి రూ.4వేల వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ఓపెన్ రీచ్‌లన్నీ ప్రారంభిస్తే ఈ దోపిడీ కొంతవరకూ అదుపు చేసే అవకాశం ఉంటుంది. వేమగిరి ఓపెన్ రీచ్‌లో కూడా అక్రమంగా ఇసుక తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మిగతా ఓపెన్ రీచ్‌లన్నింటికీ త్వరగా అనుమతిస్తే ఇసుక లభ్యత ఉంటుంది. దీంతో కొంతవరకూ అక్రమాలను అరికట్టే అవకాశం కూడా ఉంటుంది. ఈసారి అధికారులు కాతేరు ర్యాంపులకు ఇంకా అనుమతివ్వలేదు. ఇక్కడ కూడా బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. మరొక పక్క మినీ మెకనైజ్డ్ బోట్లకు అనుమతిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. అవి త్వరగా ఇచ్చినా ఇసుక కావలసినంత దొరిక అక్రమాలు కూడా అదుపులో ఉంటాయి.

నేటి నుంచి ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు

- ● మూడురోజులపాటు రంగోలి, స్విమ్మింగ్, పడవల పోటీలు, డ్రాగన్ బోటు పోటీలు
- ● పాల్గొననున్న జాతీయస్థాయి క్రీడాకారులు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు





ఆత్రేయపురం ప్రధాన కాలువలో పడవ పోటీల ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. శనివారం ఆత్రేయపురం రేవు వద్ద ప్రారంభంకానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ పోటీల్లో జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొంటారు. ఆత్రేయపురంలో క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేశారు. ఈనెల 11న రంగోలి పోటీలు నిర్వహించనున్నారు. 350 మంది మహిళలు పాల్గొంటారు. అలాగే మూడు విభాగాల్లో స్విమ్మింగ్ పోటీలు, పతంగులు ఎగురవేయడం నిర్వహించనున్నారు. 12నఉదయం పడవల పోటీలు, డ్రాగన్ బోటు పోటీలు నిర్వహిస్తారు. 13న ఈత, పడవ పోటీలు సెమీ ఫైనల్స్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు. పడవ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 15 టీమ్‌లకు సంబంధించి 100మంది తరలివచ్చారు. పడవ పోటీలకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.30వేలు... ఈత, పతంగుల్లో పోటీల్లో విజేతలకు ప్రథమం రూ.15వేలు, ద్వితీయం రూ.10వేలు, తృతీయం రూ.7,500 మెడల్స్‌తో అందించనున్నారు. లొల్ల లాకుల ఉచ్చిలి వరకు కాలువ గట్లను శుభ్రం చేసి సిద్ధపరిచారు. పోటీలు తిలకించేందుకు బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపు తదితర కార్యక్రమాలను వివిధ శాఖల పర్యవేక్షణలో నిర్వహించారు. శుక్రవారం ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.పలు శాఖాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

నిమిషాల్లో రూ.5.28 లక్షలు మాయం

- మోటారు సైకిల్‌పై వెళ్తూ నగదు పోగొట్టుకున్న ధాన్యం వ్యాపారి

ద్రాక్షారామ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి మోటారు సైకిల్‌పై వెళతూ రూ.5.28 లక్షలు నగదు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కాపవరానికి చెందిన రెడ్నం రామచంద్రరావు ఈనెల 8న రామచంద్రపురం వచ్చి పెయింటింగ్‌కు సూర్య సెమ్ 10 కిలోల ప్యాకెట్ కొనుగోలు చేశాడు. ధాన్యం వాప్యారం తాలూకా సొమ్ము రైసుమిల్లు యజమానికి వద్దకు వెళ్లి రూ.5.28 లక్షలు నగదు తీసుకున్నాడు. తనతోపాటు తెచ్చుకున్న సంచిలో నగదు పెట్టి ఆపైన వైట్‌సిమెంటు ప్యాకెట్ పెట్టి తన మోటారు సైకిల్ వెనకపక్క ఉన్నరింగుకు సంచి తగిలించాడు. తిరిగి కాపవరం బయలుదేరాడు. మధ్యలో వెనుక సంచిని గమనిస్తూ ప్రయాణం సాగించాడు. వెల్ల గ్రామం దాటిన తరువాత తాడిపల్లి వెళ్లే రోడ్డు వద్ద ఒకసారి వెనుకకు తిరిగి చూశాడు. సంచి ఉంది. అనంతరం ఇంటికి వెళ్లి చూడగా రింగుకు సంచి ఒకతాడు మాత్రమే ఉంది. సంచిలేదు. దీంతో వెంటనే తాడిపల్లి రోడ్డు జంక్షన్ వరకు రోడ్డులో వెళ్లిచూశాడు. సంచి కనపడలేదు. వెంటనే కందులపాలెం వంతెన వద్ద ఉన్న దుర్గమ్మగుడి వద్ద సీసీ కెమెరాను పరిశీలించగా రాత్రి 8.27గంటలకు సంచి ఒక తాడు తెగివేలాడుతూ కనిపించింది. తిరిగి వచ్చిన సమయం చూసేసరికి 8.36 గంటలు అయింది. సీసీ కెమెరా ఫుటేజీ ప్రకారం రామచంద్రరావు ఎదురుగా మోటారు సైకిల్ వచ్చి కందులపాలెం వైపు వెళ్లిపోయింది. నిమిషాల వ్యవధిలో వెనుక వైపు నుంచి కారు, మోటారు సైకిల్ ఉండూరు వైపుగా వెళ్లాయి. దీంతో రామచంద్రరావు ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాజమహేంద్రవరంలో యువకుడి ఆత్మహత్య

- కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవరోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ఒక ఇంట్లో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుక్కుంపేట వరలక్ష్మికాలనీకి చెందిన ఐ.సాయి(22) ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆవరోడ్డుకు చెందిన కిరణ్ వద్ద కీబోర్డు నేర్చుకుని ఈవెంట్‌లు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఈవెంట్‌కి వెళ్తున్నట్టుగా ఇంట్లో చెప్పి కిరణ్ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి ఈవెంట్‌కి వెళ్లి వచ్చారు. రాత్రికి ఆవరోడ్డులోని కిరణ్ ఇంట్లో ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం కూడా ఫోనులో స్నేహితులతో మాట్లాడారు. ఈ క్రమంలో కిరణ్ బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి సాయి ఉరివేసుకుని వేలాడుతున్నాడని, ఇది గమనించి వెంటనే సాయిని కిరణ్ కిందికి దించి ఆస్పత్రికి తరలించే లోపు మరణించాడని పోలీసులు తెలిపారు. సాయి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సాయి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

‘ఆదిత్య’లో ఉత్సాహంగా కలర్స్

గండేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య కలర్స్ యూత్ ఫెస్ట్ యువజనోత్సవాలు రెండో రోజైన శుక్రవారం మరింత ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థినుల సంప్రదాయ నృత్యాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ఫ్యాషన్ షోలో సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. స్కిట్‌లు ఆద్యంతం నవ్వులు పూయించాయి. 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో కేఎల్ యూనివర్శిటీ, మహిళల విభాగంలో ఆదిత్య యూనివర్శిటీ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ విభాగాల్లో విజేతలకు ఆదిత్యయూనివర్శిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, వివిధ విభాగాల డీన్‌లు బహుమతులు అందజేశారు.



వాలీబాల్, ఫ్యాషన్ షో పోటీల దృశ్యాలు



సంక్రాంతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగ రోజుల్లో రైలు ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి పీఆర్ నంబరు 760 పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

● 07038 నెంబరు గల కాకినాడ నుంచి చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13న రాత్రి 8.30 గంటలకు బయలుదేరి సామర్లకోటకు 8.45 గంటలకు చేరుకుని తిరిగి రాజమహేంద్రవరం మీదుగా చర్లపల్లికి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుతుంది.

● 07078 నెంబరు గల సికింద్రాబాద్-కాకినాడ టౌన్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 12, 19ల్లో సికింద్రాబాద్ నుంచి ఉదయం 10.05 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7.15 గంటలకు సామర్లకోటకు చేరుకుని కాకినాడకు 7.30 గంటలకు చేరుతుంది.

● 07079 నెంబరుగల కాకినాడ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 12,19ల్లో కాకినాడ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి 8.15గంటలకు సామర్లకోటకు చేరుకుని రాజమహేంద్రవరం మీదుగా సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుతుంది.

● 07031 చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్ ప్రెస్ ఈనెల 12,14ల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.15 గం టలకు సామర్లకోటకు చేరుకుని 8.30 గంటలకు కాకినాడకు చేరుతుంది.

● 07032 కాకినాడ-చర్లపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 11,13,15ల్లో రాత్రి 8.30గంటలకు బయలుదేరి సామర్లకోటకు 8.45 గంటలకు చేరుకుని తిరిగి చర్లపల్లికి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు చేరుతుంది.

● 07487 నాందేడ్-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌రైలు ఈనెల 13న మధ్యాహ్నం 2.25 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.55 గంటలకు సామర్లకోటకు చేరుకుని తిరిగి 8.10 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది.

● 07488 కాకినాడ టౌన్-నాందేడ్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 14న సాయంత్రం 6.30 గంటలకు కాకినాడలో బయలుదేరి సామర్లకోటకు 6.45గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం మీదుగా నాందేడ్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 3.10 గంటలకు చేరుతుంది.

మన్యంలో చలి పంజా

దేవీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలో గత నెల నుంచి చలి తీవ్రత పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8గంటల వరకు ఇళ్లల్లో నుంచి బయటకు రాని పరిస్థితి కనిపిస్తోంది. రైతులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు తమ పనులకు వెళ్లేందుకు చలి దెబ్బకి వెనుకడుగు వేస్తున్నారు. సాయంత్రం 5గంటల సమయానికి చీకటి పడి చలి గాలులు వీయడంతో ఎవరూ ఇళ్లల్లో నుంచి బయటకు రావడంలేదు. చలి మంటలు వేసుకుని కాగుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో శుక్రవారం జాతీయ రహదారిపై బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆలమూరు ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి గత కొద్ది రోజులుగా సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ తిరిగేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

అభ్యంతరాల స్వీకరణ

రాజమహేంద్రవరంసిటీ, జనవరి10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈడిస్ట్రిక్ మేనేజర్ పోస్టుకు ఒప్పంద ప్రాతిపదికన పని చేసేందుకు స్వీకరించిన దరఖాస్తుల్లో అభ్యంతరాలుంటే ఈనెల 16వతేదీలోగా కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి విభాగంలో ఆధారాలతో సమర్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. రూపొందించిన తాత్కాలిక జాబితా అధికారిక వెబ్‌సైట్ ఈస్ట్‌గోదావరి.ఏపి.జీవోవీ.ఇన్‌లో పెట్టామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కడియం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):వీరవరం కోదండరామ, వేంకటేశ్వరస్వామి ఆలయానికి కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా కేవీవీసత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆదిమూలం సాయి, కార్యదర్శిగా పడాల ప్రసాద్, ట్రెజరర్‌గా బచ్చుమధు, జాయింట్ ట్రెజరర్‌గా గంగిశెట్టి వీరభద్రరావు, డైరెక్టర్లగా లంక అచ్యుతరామారావు, చవుటిపల్లి దుర్గారావు, ఆదిమూలం వీరవెంకన్న, మోతుకూరి లక్ష్మణ్, ఆలపాటి సాయి, లంకవెంకటలక్ష్మినియమితులయ్యారు

భరత్ రామ్ నీచ రాజకీయాలు మానుకో

టీడీపీ నేతలు దాస్యం, చాపల

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ భరత్ రామ్ నీచరాజకీయలు చేయడం మానుకుంటే, అతనికే మంచిదని టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్‌నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా భావించి అహం ప్రదర్శిస్తే ప్రజలే తగిన శాస్తి చేస్తారన్నారు. ఇప్పటికే ప్రజలు భరత్‌ను ఘోరంగా ఓడించి ఇంటికి పంపించారని,



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం, చాపల

ఇప్పటికైనా తప్పుడు పనులు మానుకోవాలన్నారు. వైసీపీలోనే నీ చేష్టలకు విసుగు చెందిన చాలామంది నీకు దూరమైపోయారని అన్నారు. 24గంటలూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి కుటుంబంపై పడి ఏడవడం తప్ప వేరే పనిలేదని ధ్వజమెత్తారు. టీడీపీ గేట్లు ఓపెన్ చేస్తే నీ పక్క ఉన్నవాళ్లు కూడా మిగలరన్నారు. కార్మిక నాయకుడి చెప్పుకునే 420 ప్రవీణ్ చౌదరిని వెనకేసుకుని వచ్చి, కార్మికులకు ద్రోహం చేశావని ప్రజలు నిన్ను అస్సలు క్షమించారని అన్నారు. బేసరి చిన్ని మాట్లాడుతూ 220మంది కార్మికులను పర్మినెంట్ చేయించానని డబ్బా కొడుతున్న ప్రవీణ్ చౌదరి బాగోతాలు అన్ని బయటకు వచ్చాయన్నారు. టీడీపీ నాయకులు సలాది ఆనంద్, చింతపల్లి నాని, కిందికోండ అనంత్, షేక్ బషీర్, దుత్తరపు గంగాధర్, మామిడి శ్రీను, బూరా రమణ, కానేటి ప్రభుదాసు, మేడికొండ అప్పారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సరికాదు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జననాయకుడు పోర్టల్ ద్వారా వస్తున్న అర్జీలను సకాంలో పరిష్కరించాలని ఆదేశిస్తే కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జన నాయకుడు పోర్టల్ ద్వారా ప్రజా సమ్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంలో మంచి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈకార్యక్రమంలో ద్వారా చాలా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయన్నారు. పోర్టల్‌లో నమోదైన సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్ నుంచి అర్జీదారులకు ఫోన్‌చేసి వారి అభిప్రాయం కూడా తీసుకుంటున్నారని చెప్పారు. జననాయకుడు కేంద్రానికి వెళ్లలేని వారి కోసం టోల్ ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. జన నాయకుడు పోర్టల్ కార్యక్రమం ప్రస్తుతం కుప్పంలో ప్రయోగత్మకంగా చేపడుతున్నారని, త్వరలో రాష్ట్రమంతా నిర్వహించే అవకాశం ఉందన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు వారి తీరు మార్చుకుని వేగంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



ఎమ్మెల్యే శ్రీనివాస్

ముందస్తు సంక్రాంతి వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం షిర్డిసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో సందడి చేసారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ దీప్తి, డాక్టర్ జ్యోతి విచ్చేసారు. తొలుత భోగిపళ్ల వేడుక నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి లక్ష్మి, ధాన్యలక్ష్మి, రైతు, గంగిరెద్దు, హరిదాసు, పిట్టల దొర, సోదెమ్మ, బుడబుక్కలిపాటు దేవతామూర్తుల వేషధారణలతో అలరించాయి. నాగమణి పాలేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య పాల్గొన్నారు.

కడియం:మండలంలోని వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కె.జయరాజు నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఎంఈవోలు వై.నాగేశ్వరరావు, ఎం.మణికుమార్ విచ్చేశారు. అంగన్‌వాడీ టీచర్లు రంగవల్లులు తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకవల్లి, సూపర్‌వైజర్ సత్యశ్రీ, సర్వశిక్షాభియాన్ మండల ఇంజనీర్ కె.వీరభద్రరావు, ఎస్.సతీష్‌బాబు, ఎం.కుమారిదేవి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు వి.లజపతిరాయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నన్నయ వీసీగా శెట్టిబలిజలను నియమించాలి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ఈసారి శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడ్ని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శెట్టిబలిజ సేవా సమితి డిమాండ్ చేసింది. స్థానిక తిలక్‌రోడ్డులోని సమితి కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సమితి వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యపై ఎక్కువగా పేద వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీలు ఆధారపడి ఉంటారని, బీసీల్లో ఎక్కువశాతం శెట్టిబలిజలు ఉన్నందున వీసీగా అర్హతగల శెట్టిబలిజ విద్యావంతుడికి అవకాశం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చి ఎన్నికల్లో విజయానికి శెట్టిబలిజలు కృషి చేశారన్నారు. ఈనేపథ్యంలో వీసీ పదవి శెట్టిబలిజలకు ఇచ్చి గుర్తించాలన్నారు. సేవా సమితి రాజమండ్రి అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటివరకు వీసీలుగా పనిచేసిన వారిలో శెట్టిబలిజలు లేనందు ఈసారి అవకాశం ఇచ్చి గౌరవించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి బత్తిన ఏడుకొండలు, కోశాధికారి బొక్కా సత్యవెంకట ప్రతాప్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శులు వాసంశెట్టి నాగేశ్వరరావు , వాసంశెట్టి నాగభూషణం, పోలవరపు రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సానబోయిన రామారావు

'ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):ఇల్లులేని పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలం కూటమి ప్రభుత్వం కేటాయించే వరకూ పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం సాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, స్థలాలు చూపించలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వారందరికీ న్యాయం చేయాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, కార్యవర్గ సభ్యులు సిడగం నౌరుజీ, చింతలపూడి సునీల్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.లావణ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు త్రిమూర్తులు, ప్రజానాట్యమండలి అధ్య క్షుడు ముప్పన కుమార్, మహిళలు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం షిర్డిసాయి విద్యాసంస్థల సంక్రాంతి వేడుకల్లో విద్యార్థుల వేషధారణలు

వైకుంఠ ద్వార దర్శనం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి మందిరంలో శుక్రవారం కూర్మదాసు ప్రభాకరరావు బ్రదర్స్ సౌజన్యంతో పూలండి సేవ జరిపారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సౌభాగ్యలక్ష్మి దంపతులు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కూర్మదాసు ప్రభాకరరావు దంపతులు, వాకచర్ల కృష్ణకుమారి దంపతులు, టీడీపీ నాయకుడు మజ్జి రాంబాబు,వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని పూజల్లో పాల్గొన్నారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, రిటైర్డ్ ఆర్డీవో ఎం.జితేంద్ర, పోలసానపల్లి హనుమంతరావు, వఎస్ఎస్ కృష్ణకుమార్ వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

'గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన తప్పనిసరి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్టేట్ నోడల్ ఆఫీసర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు న్యాయశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారన్నారు.

'టీటీడీ చైర్మన్, ఈవోలపై చర్యలు తీసుకోవాలి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):గతంలో ఎన్నడులేనివిధంగా ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రం తిరుపతిలో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించిన సంఘటనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో చౌదరిలను బాధ్యులను చేస్తూ తక్షణమే వారిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతిచెందితే ఏ మఠాధిపతి ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. గతంలో తిరుపతి లడ్డు ప్రసాదం విషయంలో స్పందించిన పీఠాధిపతులు, భక్తుల ప్రాణాల విషయంలో ఎందుకు నోరుమెదపలేదన్నారు. హైదరాబాద్‌లో సినిమా థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి మహిళ మృతి చెందితే ఆ సినిమా హీరోపై అక్కడ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసు నమోదు చేసి అరెస్టు చేసిందన్నారు. కాని తిరుపతిలో ఘటనలో కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదాని పోర్టుకు రోడ్లు వేసుకునేందుకే ప్రధాని మోదీ విశాఖకు వచ్చారని విమర్శించారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఎల్‌ఐసీ పెన్షనర్ల ధర్నా



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు స్థానిక పెన్షనర్లు మోరంపూడి జంక్షన్ వద్ద జీవిత బీమా డివిజనల్ కార్యాలయం గేటు వద్ద మధ్యాహ్నం రెండు గంటలు ధర్నా నిర్వహించారు. 1.1.1986 కన్నా ముందు పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ పెంచాలని, పెన్షనర్లు అందరికీ ఒకే విధంగా కరువు భత్యం రిలీఫ్ ఉండాలని, మెడిక్లెయిమ్ పాలసీలో మెరుగుదల, నెలవారీ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కుటుంబ పెన్షనర్లకు, బేసిక్ పేలో 30శాతం కుటుంబ పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌కు ఎల్‌ఐసీ పెన్షనర్లు మద్దతు తెలిపారు. పై డిమాండ్లపై ఒక తీర్మానం ఆమోదించి ఎల్‌ఐసీ చైర్మన్, జీఐసీ చైర్మన్, కేంద్ర ఆర్థిక మంత్రికి పంపించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌ఏ డివిజన్ నాయకులు వై.రఘునాథరావు, కేఎస్ మూర్తి, పీవీ మురళీకృష్ణ, బీవీ రమణ జీవీ అప్పారావు, ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకులు మాథ్యూస్, కోదండరామ్, సత్యదేవ తదితరులు పాల్గొన్నారు.

'తిరుమల' బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వెళ్లిన ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని, క్షతగాత్రుల వైద్యానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి విమానాశ్రయం వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం మధురపూడి విమానాశ్రయానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. మధురపూడి విమానాశ్రయం వద్ద కలెక్టర్ పి.ప్రశాంత, ఏలూరు రేంజ్ డీఐజీ జీవీవీ అశోక్‌కుమార్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర రావు స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ సీఎం రాజానగరం మీదుగా కాకినాడ జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

కేంద్ర నీటి వనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి స్వాగతం

కోరుకొండ/రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టును పరిశీలించేందుకు కేంద్ర నీటి వనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజీవ్‌ప్రతాప్ రూడి నేతృత్వంలో బృందం జిల్లా పర్యటకు వచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం మధురపూడి విమానాశ్రయంలో చైర్మన్ రాజీవ్ ప్రతాప్, రాజ్యసభ సభ్యులు ఖీరు మహ్తో, ధర్మశీలగుప్తా, లోక్‌సభ సభ్యులు రీషేర్ సింగ్ ఘుబాయా, రోడ్మల్ నగర్, జోయంత బసుమతరీ, నారాయణ్‌దాస్ అహిర్వార్, సంజ్ఞ జాతవ్, సాగర్ ఈశ్వర్, ఖండ్రే, విశాల్ (దాదా), ప్రకాష్బాపు పాటిల్, మోహిత్, పాటిల్ ధైర్యషీల్ రాజ్‌సిన్హాల బృందానికి కలెక్టర్ పి.ప్రశాంతి, ఇరిగేషన్ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరావు, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం రాత్రికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నివాసానికి ఈ బృందం చేరుకుంది. ఎంపీ సాదరంగా వారిని స్వాగతించారు. బృందానికి ఎంపీ గౌరవార్థ డిన్నర్ ఇచ్చారు. అనంతరం వారు రాజమహేంద్రవరంలోనే బస చేశారు. శనివారం ఉదయం పోలవరం ప్రాజెక్టు ప్రాంతం పరిశీలనకు వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

సారా స్థావరాలపై దాడి
ముగ్గురిపై కేసు నమోదు

రంగంపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం ఈలకొలను, దొడ్డిగుంట గ్రామాల్లో శుక్రవారం రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో సారా స్థావరాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 175 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, 3,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. కె.గోవింద్, కె.చిట్టెమ్మ, జె.శివరాంలపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాలొన్నారని ఆమె తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తరద్వార దర్శనం



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు

కోరుకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్తరద్వారదర్శనం వైభవంగా జరిగింది. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు తెల్లవారుజామున స్వామి వారి దిగువ దేవస్థానం వద్ద లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ సతీమణి అన్నపూర్ణ, బీజేపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి ఉత్తరద్వారం వద్ద స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్తరద్వార దర్శనాన్ని అర్చకస్వాములు భక్తిశ్రద్ధలతో జరిపారు. గర్భాలయం నుంచి స్వామివారిని పల్లకీలో ఉంచి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనాన్ని కల్పించారు. వేలాది మంది భక్తులు ఉత్తరద్వార దర్శనం చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఇతర ప్రముఖులకు అన్నవరం దేవస్థానం అధికారులు స్వామి వారి శేష వస్త్రం, శేషమాల, తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా గ్రామోత్సవం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కాపవరం గ్రామంలోకి స్వామి వారి పల్లకి వచ్చిన వెం టనే గ్రామస్తులు మంగళనీరాజనాలు అందించారు. కార్యక్రమంలో కాపవరం సర్పంచ్ జాజుల రాము, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు బారులుతీరి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయ అర్చకులు పెద్దింటి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపారు. కర్తలుగా మేడపాటి వెంకటరెడ్డి వేణుశ్రీ దంపతులు పాల్గొన్నారు.



బిక్కవోలులో గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనారాయణులు

లక్ష్మీనారాయణ ఆలయంలో: మండలంలో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిపారు. బిక్కవోలులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై వుంచి గ్రామోత్సవం జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనాలు కల్పించారు. గ్రామంలోని ఊలపల్లి రోడ్డు, రావిచెట్టు సెంటర్‌లోని రామాలయాల్లో ముక్కోటి సందర్భంగా ఏకాహం నిర్వహించారు.

రాజానగరం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు. రాజానగరంలో వేణుగోపాలస్వామికి పల్లకీ ఉత్సవం జరిపారు. భక్తులు గోవింద నామ స్మరణతో పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.



రాజానగరంలో పల్లకిలో ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

నన్నయ ఆచార్యుడికి సంక్రాంతి విశిష్ట సేవా పురస్కారం

దివాన్‌చెరువు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని నన్నయ ఆచార్యుడు తరపట్లకు సంక్రాంతి విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. తరపట్ల నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సు, కవి సమ్మేళనలు, అవధానాలు నిర్వహించి తెలుగు భాషా సాహిత్య సాంకేతిక సేవలందిస్తున్నారు. తెలుగు మహా సభల కార్యక్రమాల నిర్వహణలో సాహితీ సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసి సత్కరించినట్లు తరపట్ల చెప్పారు.



సత్కరిస్తున్న జీజీయు కులపతి చైతన్యరాజు

తహశీల్దార్‌గా సత్యవతిదేవి బాధ్యతల స్వీకరణ

రాజానగరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజానగరం తహశీల్దార్‌గా జి.అనంత లక్ష్మి సత్యవతి దేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో కోఆర్డినేషన్ సెక్షన్‌లో సూపరిండెంటెండ్‌గా (తహశీల్దార్)గా విధులు నిర్వర్తిస్తున్న ఈమెను రాజానగరం తహశీల్దార్‌గా డిప్యుటేషన్‌పై నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు విడుదల చేసిన విషయం విధితమే. ఈనేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న ఎన్.లక్ష్మీ లావణ్యను డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రాజానగరం తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎన్.లక్ష్మీలావణ్యను డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం ఉండాలి: మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా వీఆర్వోలు కృషి చేయాలని తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి సూచించారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలంలోని వీఆర్వోలతో స్థానిక కార్యాలయంలో సమీక్షించారు.

వీరుళ్లమ్మ జాతరకు చురుగ్గా ఏర్పాట్లు


అనపర్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అనపర్తి వీరుళ్లమ్మ అమ్మవారి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అమ్మవారికి 1008 మంది మహిళలతో హరిద్రాభిషేకం జరిపారు. 13న భోగితో ప్రారంభమయ్యే ఉత్సవాలు 14న రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించనున్నారు. 15వ తేదీ నుంచి 18 వరకు అమ్మవారి ఉత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

అనపర్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో కళాకారిణిలు పలు ప్రదర్శనలిచ్చి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నృత్య గురువు శ్రీకాంత్ రఘుపాత్రుని సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

పశువుల షెడ్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం చినకొండేపూడి, రాపాక గ్రామాల్లో నిర్మించిన పశువుల షెడ్‌లను శుక్రవారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. చినకొండేపూడి, రాపాక గ్రామాల్లో పశువుల షెడ్‌లను నెలకొల్పారు. అనంతరం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోత్స్న, జడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మి, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఏపీవో నాగేశ్వేణి, వివిధ శాఖల అధికారులు, తొర్రిగడ్డ నీటి సంఘం ఉపాధ్యక్షులు మందపాటి జగపతిరాజు, కాండ్రు శేఖర్, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.





ముక్కోటినీ మొక్కారు!





శేషశైల వాసా: (వరుసగా) ఆదిశేషువుపై భక్తులకు దర్శనమిచ్చిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి, శేషపాన్పుపై అమ్మవారితో దర్శనమిచ్చిన అన్నవరం సత్యనారాయణస్వామి.. భక్తులకు దర్శనమిస్తున్న చిన వెంకన్న

ముక్కోటి దేవతలతో తరలివచ్చిన శ్రీమహా విష్ణువును జనకోటి మొక్కింది.. గోవిందా.. గోవింద.. నమో నారాయణ అంటూ స్వామిని భక్తజనం కొలిచారు.. శేష శైల వాసా శ్రీ వెంకటేశా అంటూ గీతాలు ఆలపించారు.. కనులారా స్వామిని తిలకించి కోర్కెలు తీర్చమని వేడుకున్నారు.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి.. వైష్ణవ ఆలయాలకు పెద్దఎత్తున భక్తజనం హాజరై క్యూకట్టారు.. అన్నవరం సత్యనారాయణ స్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాలకు శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో ఉత్తరద్వారంలో వైకుంఠవాసుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. పూలతో చేసిన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.. ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాలకవర్గాలు చర్యలు చేపట్టాయి..

పద్ధతి మార్చుకోకుంటే.. నే రోడ్డెక్కుతా!



పవన్‌కు బొట్టు పెడుతున్న మహిళ

కుర్రకారు..పోలీసులకు పవన్ హెచ్చరిక

- మీకూ నిద్రాహారాలు ఉండవు జాగ్రత్త
- ఈవ్‌టీజింగ్ చేస్తే తొక్కినారతీస్తా
- గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగాయి
- పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- ఇక నుంచి నెలకు 14 రోజులు ఇక్కడే
- పిఠాపురం నుంచే రాష్ట్రవ్యాప్త యాత్ర
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఈవ్‌టీజింగ్ అంటే నాకు చిరాకు. పద్ధతి మార్చుకోకుంటే తొక్కి నారతీస్తా. నేను గనుక రోడ్డు మీదకు వస్తే ఎవరికీ నిద్రాహారాలు ఉండవు. గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రివేళల్లో బైక్‌లపై విన్యాసాలు చేస్తున్నారు. చోరీలు అధికమయ్యాయి. పిఠాపురంలో పోలీసులు ఉదాసీనంగా ఉంటున్నారనే ఫిర్యాదులు అధికమయ్యాయి అంటూ పోలీసుశాఖ పనితీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిఠాపురానికి జాతీయస్థాయిలో పేరు తీసుకురావాలని ఉందని తెలిపారు. అదే సమయంలో పిఠాపురం నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని చెబుతూ ఫోన్ చూస్తూ పోలీసులపై వచ్చిన కొన్ని ఫిర్యాదులను చదివి వినిపించారు. కొద్దిరోజుల కిందట పిఠాపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోకి రాత్రి పూట ఇద్దరు వ్యక్తులు వచ్చి అక్కడ విద్యార్థులను బెదిరించి వారి వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు లాక్కుని పరారయ్యారని తెలిపారు. మెయిన్‌రోడ్డులో కత్తి చూపించి బెదిరించి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారని.. ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొందరు యువకులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ కేశవరావు పోలీసుల దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు. అయినా తగ్గకపోగా ఈవ్‌టీజింగ్ పెరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడపిల్లలను ఏడిపిస్తే మగతనం కాదనే విషయాన్ని యువకులు తెలుసుకోవాలని, మగతనం కావాలంటే సైన్యంలో చేరాలని హితవు పలికారు.తన నియోజకవర్గంలో ఈవ్‌టీజింగ్ అనే మాట ఇక వినపడకూడదని, ఆడపిల్లలను ఏడిపిస్తే తొక్కి నారతీస్తానని హెచ్చరించారు. పోలీసుస్టేషన్లలో లాయర్లు సెటిల్‌మెంట్లు చేయకూడదని పోలీసులకు హితవు పలికారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఏ అధికారిని నేను రికమెండ్ చేయలేదు. సుపరిపాలన ఇవ్వండి అని కోరానని తెలిపారు. అది జరగకపోతే నాలాంటి వారు వచ్చి రోడ్డు మీద తిరిగితే ఎవ్వరికి నిద్రాహారాలు ఉండవని హెచ్చరించారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు,కుడా చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ వార్డు కౌన్సిలర్ నల్లా రమణమ్మ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తదితరులు ఉన్నారు.

పిఠాపురం నుంచి యాత్ర ప్రారంభిస్తా..

స్టార్‌డమ్ వదులుకుని ఒకటిన్నర దశాబ్దంగా నలిగిపోయా.. ఆటుపోట్లు ఎదుర్కొన్నా.. ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి.. ఆ గాయాలకు పిఠాపురం ప్రజలు మందు పోశారని పవన్ తెలిపారు. మీరు చుక్కనీరు దొరక్క దాహంతో అలమటిస్తున్న వ్యక్తికి నీరందిస్తే ఎలా ఉంటుందో గెలుపు ద్వారా రుచి చూపించారు. 26 జిల్లాలు తిరగాలని అనుకున్నా. అయితే ఇంటిని శుభ్రం చేసిన తర్వాత రాష్ట్రం సంగతి చూద్దామని భావించి పిఠాపురం నుంచే తన యాత్ర మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తాను కొన్న స్థలంలోనే షెడ్లు వేసుకుని నెలలో 14 రోజులు ఇక్కడే ఉండి 54 గ్రామాలు వెళ్లి అందరినీ కలుస్తానన్నారు. ముందుగా ఉప్పాడ మత్స్యకార గ్రామాల నుంచి మొదలుపెడతానని పవన్ చెప్పారు.

50 నిమిషాలు స్టాల్స్ దగ్గరే..

పిఠాపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పవన్ రాకతో పిఠాపురంలో ముందుగానే సంక్రాంతి వచ్చేసింది. పిఠాపురం పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. హరిదాసు కీర్తనలు.. పిట్టదొరల కోతలు, మాటలు వింటూ, జంగమదేవర జోస్యాన్ని ఆసక్తిగా ఆలకించారు. మహిళతో సోది చెప్పించుకున్నారు. రథాలపేట అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో సరదాగా ముచ్చటించి భోగిపండ్లు వేశారు. గర్భిణులు కె.వరలక్ష్మి, ఏ.రమ్యలకు సీమంతం నిర్వహించి ఆశీస్సులు అందించారు. చేనేత జౌళిశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నేత, పట్టు చీరలు, జాంధాని చీరలను తిలకించి ప్రత్యేకంగా ఆరా తీశారు. గ్రంథాలయ సంస్థ పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. సుమారు 50 నిమిషాలకుపైగా స్టాల్స్ వద్ద గడిపారు. కుమారపురంలో ఉపాధిహామీ పథకం కింద రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీగోకులం ప్రారంభించారు.నాలుగు గోవులను రైతు యాతం నాగేశ్వరరావుకు అందజేశారు. ఇక్కడ నుంచే రాష్ట్రంలో 12,500 గోకులాలకు ప్రారంభోత్సవం చేశారు.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పవన్.. చీరల స్టాల్ పరిశీలన.. బుక్ చదువుతున్న పవన్



పవన్‌కు బొకే ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, సభలో అతిథులు





మేమంతా మీ వెంటే: పవన్ సభకు హాజరైన జనం

పన్ను పోటు!



10 నెలలకు 18 శాతమే పన్నుల వసూళ్లు

- మొత్తం రూ. 81.32 కోట్లు
- వసూలు చేసింది రూ.11.50 కోట్లు
- వసూలు చేయాల్సింది రూ.70 కోట్లు
- జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిర్లక్ష్యం
- అయినా పట్టని యంత్రాంగం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- పక్కదారి పడుతున్న నగదు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):పన్నుల వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది.. గతంలో పోటీపడి మరీ పన్నుల వసూళ్లు చేసేవారు. ప్రస్తుతం సిబ్బంది పెరిగినా పన్నుల వసూళ్లు మాత్రం మందగించాయి. సచివాలయ సిబ్బంది చేసే పని చాలా తక్కువ. అటువంటిది కనీసం పన్నులు వసూళ్లపై కూడా దృష్టి సారించడంలేదు. దీనికి జిల్లాలో పన్నుల వసూళ్లే ఒక ఉదాహరణ. ప్రతి ఏడాది మార్చి నుంచి మార్చికి పన్నుల వసూళ్లు లెక్కిస్తారు. మరో రెండు నెలల్లో మార్చి రాబోతుంది.ఇప్పటికి కేవలం 20 శాతం పన్నులు వసూళ్లు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఒకవైపు కలెక్టర్ పన్నులు నూరు శాతం వసూలు చేయాలంటూ అధికా రులకు ఆదేశాలు జారీ చేస్తున్నా పెడచెవిన పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామాలైనా,పట్టణాలైనా ప్రగతి సాధించాలంటే పన్నుల వసూళ్లు తప్పనిసరి..జిల్లాలో పన్నుల వసూళ్లు చూస్తే పని గాడి తప్పినట్టనిపిస్తుంది.జిల్లా వ్యాప్తంగా సుమారు 19 శాతం వసూలు కాలేదంటే పంచాయతీ అధికారుల అలసత్వం అర్థం చేసుకోవచ్చు.

18 శాతమే వసూలు..

జిల్లాలో రాజమహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లకు సంబంధించి 300 పంచాయతీల్లో సుమారు రూ.81,32,64,150లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.11.50 కోట్లు మాత్రమే వసూళ్లు చేయడం గమనార్హం.రాజమహేంద్రవరం డివిజన్ 147 గ్రామాల్లో రూ.50,94,276 కొవ్వూరు డివిజన్ 153 గ్రామాలకు రూ.16.29 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.వసూలు చేసింది సగటున 18 శాతం మాత్రమే.వచ్చే రెండు నెలల్లో సుమారు రూ.70 కోట్ల వరకూ వసూలు చేయాల్సి ఉంది.జిల్లాలో భవన నిర్మాణాలు పూర్తయినా ఇంకా పన్నులు వేయకుండా ఉన్న భవనాలు వేలల్లో ఉన్నట్టు సమాచారం.జిల్లా కలెక్టరేట్ ఉన్న రాజమహేం ద్రవరం రూరల్ పరిధిలోనే పదుల సంఖ్యలో భవనాలకు చాలా ఏళ్లగా పన్నులు లేవంటే అతిశయోక్తి కాదు.

కలెక్టరేట్ పరిధిలోనూ ఇంతే..

జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయాల్సిన పన్నులు ఏరియర్స్ కలిపి రూ.80 కోట్లకు పైబడి ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోనే ఏరియర్స్‌తో కలిపి మొత్తం రూ.29.13 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 22.28 శాతం అంటే రూ.6.50 కోట్లు మాత్రమే వసూలు చేశారు.ఇంకా సుమారు రూ.22.65 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా వసూలు చేసిన పన్నులు ఎప్పటికప్పుడు పంచాయతీ ఖాతాలో జమ చేసి నగదు పుస్తకంలో నమోదుచేయాలి.పంచాయతీల పనులకు వినియోగించాల్సి వస్తే సీఎఫ్ఎంఎస్ ద్వారా మాత్రమే చెల్లింపులు జరగాలి.చాలా పంచాయతీల్లో నగదు చెల్లింపులు చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీల్లో పన్నుల ద్వారా వసూ లైన సొమ్మును జమ చేయకుండా కార్యదర్శుల వద్దనే ఉంచుకొని వసూలు కానట్టు చూపిస్తూ మార్పింగ్ నివే దికలు ఇస్తున్నారన్న వాదన ఉంది.కలెక్టర్ చొరవ తీసు కొని పంచాయతీల్లో నగదు పుస్తకం(క్యాష్ బుక్)తో పాటు బిల్డింగ్ ప్లాన్ రిజిస్టర్లు పరిశీలించేలా చర్యలు చేపడితే అవకతవకలు బయటపడడంతో పాటు ప్రభుత్వానికి అదనంగా ఆదాయం చేకూరుతుందని పలువురు అంటున్నారు.

విద్యుత్ నియంత్రణ మండలికి సమస్యలు ఏకరువు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో శుక్రవారం విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. స్థానిక ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజలు సమస్యలు ఏకరవు పెట్టారు. విద్యుత్ శాఖను ప్రైవేటీకరణ చేయవద్దన్నారు.విద్యుత్ తయారు చేయడానికి పెరిగే ఖర్చు ప్రకారమే బిల్లు రేట్ పెంచాలన్నారు.వై.వీరభద్రరావు మాట్లాడుతూ కడియం నర్సరీలకు పూర్తిస్థాయిలో సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. ఎక్కడా సమస్యల్లేకుండా 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వీటన్నింటిని చైర్మన్ ఇన్ చార్జి ఠాకూర్ రామసింగ్ పరిగణంలోకి తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ తిలక్‌కుమార్,ఈఈలు వీవీకె షోర్, నక్కపల్లి శామ్యూల్, దాట్ల శ్రీధర్ వర్మ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల తర్వాత ఎండోమెంట్ భూమి స్వాధీనం

- తూర్పుగోనగూడెంలో 25.16 ఎకరాలు
- రూ. 78 లక్షల శిస్తు బకాయిపడిన రైతు

రాజానగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల తరువాత ఎండోమెంట్ అధికారులు దేవాదాయ భూమిని స్వాధీనం చేసుకున్నారు. రాజానగరం మండలం తూర్పుగోనగూడెం గ్రామ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రానికి సంబంధించి సర్వే నెంబరు 20,27,28,135లలో 25.16 ఎకరాలు భూమి ఉంది.ఆ పొలాన్ని రాజానగరానికి చెందిన ముత్యాల సత్యనారాయణ కుటుంబీకులు వందేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నారు. నామమాత్రపు లీజులు చెల్లించకపోవడంతో ఇప్పటి వరకు రూ.78 లక్షలు బకాయిలు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. లీజు బకాయిలు చెల్లించాలంటూ అధికారులు ఎన్నిమార్లు నోటీసులు జారీ చేసినా ఖాతరు చేయకుండా కోర్టులను ఆశ్రయిస్తూ సదరు భూమిపై వస్తున్న లక్షలాది రూపాయల ఆదాయాన్ని అన్యాయంగా దోచుకుంటున్నారని అధికారులు చెప్పారు. ఈ మేరకు అధికారులు, పోలీసుల సమక్షంలో జిల్లా దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు శుక్రవారం సదరు భూమిని గ్రామ పెద్దలు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీదారు టీటీఎస్ఆర్.ప్రసాద్, అన్నదాన సత్రం కార్యనిర్వహణాధికారులు డి.సురేష్‌బాబు, రాంబాబు రెడ్డి, ఎండోమెంట్ అధికారులు,రాజానగరం ఎస్ఐ మనోహర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి 147 ఎకరాల భూమి

శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లో 147 ఎకరాలు విలువైన పంట భూములు ఉన్నాయి. లీజు సొమ్ములు ఎగవేస్తున్న వారి నుంచి వీలైనంత త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. - **నాగేశ్వరరావు, జిల్లా దేవదాయశాఖాధికారి**



భూమిని స్వాధీనం చేసుకున్న ఎండోమెంట్ అధికారులు

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

చెరకు సాగుకు ప్రోత్సాహకాలు

2400 హెక్టార్లలో పంట సాగు.. డిప్యూటీ కేన్ కమిషనర్ సత్యనారాయణ



చాగల్లు జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరకు సాగును ప్రోత్స హించడం కోసం ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యాల సహకారంతో అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని డిప్యూటీ కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం చెరకు అభివృద్ధి మండలి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2010 చెరకు క్రషింగ్ సీజన్‌లో 14830 హెక్టార్లలో ఉండే చెరకు ప్రస్తుతం 2400 హెక్టార్లకు పడిపోయిందన్నారు. దీంతో జిల్లాలోని తణుకు ఆంధ్రా షుగర్స్, భీమడోలు, చాగల్లు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడగా వచ్చే క్రషింగ్ సీజన్ నుంచి తాడువాయి ఫ్యాక్టరీ పరిధిలో చెరకు విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల ఫ్యాక్టరీ నడిపే స్థితిలో లేమని ప్రభుత్వానికి తెలియజేసినట్టు చెప్పారు. రైతులకు పంట మార్పిడికి అవకాశం కలిగే విధంగా షుగర్ ఫ్యాక్టరీలను ప్రోత్సహించే విధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలోని చెరకు ఫ్యాక్టరీల పరిధిలోని చెరకు జోన్‌లను ఉయ్యూరు కేసీపీ షుగర్ ఫ్యాక్టరీకి కేటాయించినట్టు చెప్పారు. కేసీపీ షుగర్స్‌కు చెరకు రవాణా చేసే రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని ఆయన చెప్పారు. రైతులు గతంలో మాదిరిగా కేసీపీ షుగర్స్ చెరకు పండించి సహకరించాలని కోరారు.

చెరకుకు ధర టన్నుకి రూ.3876

ఉయ్యూరులోని కేసీపీ షుగర్స్ టన్నుకి రూ.3876 చెల్లిస్తుందని ఫ్యాక్టరీ డీజీఎం కేన్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. చెరకు మద్దతు ధర రూ.3152, ఇతర సబ్సిడీలు రూ.425, దూరం నుంచి రవాణా చేసే వాటికి టన్నుకు రూ.200, యంత్ర సహాయంతో చెరకు కటింగ్ కోసం రూ.100 కలిపి మొత్తంగా రూ.3876 చెల్లిస్తామన్నారు. దూరంగా ఉందని అపోహ వద్దని చెప్పారు. ఫ్యాక్టరీకి చెరకు రవాణా చేసిన రెండు వారాల లోపు నగదు చెల్లిస్తామని చెప్పారు. రోజుకు 8500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ సమర్థవంతంగా పనిచేస్తుందని చెప్పారు. ఫ్యాక్టరీ సిబ్బంది రైతులు కలిసి చెరకు సాగు చేసి ఫ్యాక్టరీకి సహకరించాలని కోరుతున్నట్టు వారు చెప్పారు.

కషాయాల పిచికారీతో తెగుళ్ల నియంత్రణ

ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు



పంటలపై పిచికారీ చేసేందుకు డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

పెరవలి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా పంటలపై ప్రకృతి వ్యవసాయ కషాయాలను పిచికారీ చేయడం ద్వారా పంటలపై పురుగులు, తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ కార్యక్రమంలో భాగంగా డ్రోన్ సహాయంతో తీపర్రులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ కషాయాలను పంటలపై పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటపై పురుగులు, తెగుళ్ల నివారణకు వేపగింజలు, ఇంగువ కషాయాలను, చేప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేసినట్టు తెలిపారు. మొదటి విడతగా మండలంలోని 250 ఎకరాల్లో ఈ విధంగా పిచికారీ చేయడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు డ్రోన్‌లు ద్వారా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ మాట్లాడుతూ వరి పంటపై కాండం తొలిచే పురుగు, రసం పీల్చే తెగుళ్లను నియంత్రించడానికి కషాయాలు ఉపయోగపడతాయన్నారు. అలాగే వేప గింజల కషాయంతో పాటు జీవామృతం కలిపి పంటలపై పిచికారీ చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చునని మోడల్ మేకర్ ఉమా మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మహాలక్ష్మి, షేక్ బేగం, గంగమ్మ పాల్గొన్నారు.

వేళ్లచింతలగూడెంలో క్రికెట్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి, నాలుగు మండలాల నాయకులు

గోపాలపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి శోభ వెల్లివిరుస్తోంది. ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ క్రికెట్ పోటీలు నిర్వహించారు. గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాలు ఒక జట్టుగా, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు ఒక జట్టుగా పోటీలో పాల్గొనగా గోపాలపురం-ద్వారకాతిరుమల జట్టు గెలుపొందింది. ఎమ్మెల్యే మద్దిపాటి మైదానంలో ఉండి క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ నల్లజర్ల జట్టులో సభ్యుడిగా పోటీలో దిగారు. అలాగే దేవరపల్లి సర్కిల్ పోలీస్ జట్టుతో నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు మ్యాచ్ నిర్వహించగా పోలీస్ జట్టు విజయం సాధించింది.

టిప్పర్ ఢీకొని బాలిక మృతి

తండ్రికి స్వల్పగాయాలు..నల్లజర్లలో ఘటన



వైష్ణవి (ఫైల్)



వైష్ణవి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

నల్లజర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలైయింది. మండల కేంద్రమైన నల్లజర్లలోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ బాలిక మృతిచెందింది. ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఉండి శ్రీనివాసరావు లలితాకుమారి దంపతులకు ఐశ్వర్య, వైష్ణవి(13) ఇద్దరు కుమార్తెలు. ఐశ్వర్య ద్వారకాతిరుమలలో గురుకుల పాఠశాలో 9వ తరగతి చదువుతుండగా, వైష్ణవి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. లలితాకుమారి ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో వైష్ణవిని నబీపేటకు చెందిన అమ్మ మ్మ నరసాపురం నుంచి నబీపేటకు గురువారం తీసుకొచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం తండ్రి శ్రీనివాసరావు నబీపేట నుంచి బైక్‌పై కుమార్తె వైష్ణవిని గొల్లగూడెం తీసుకెళ్తుండగా నల్లజర్ల భారత్ పెట్రోల్ బంకు వద్ద టిప్పర్ వీరిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్‌ను ఢీకొంది. దీంతో వైష్ణవి లారీ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తల్లికి ఏమని చెప్పాలో అని ఐశ్వర్య రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

హైవే అధికారుల నిర్లక్ష్యం

నల్లజర్లలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నల్లజర్ల సర్వీస్ రోడ్డు ఒక్క వాహనం వెళ్లేందుకు మాత్రమే ఉండడం వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారని గ్రామస్థులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. హైవే అధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ రోడ్డు వెడల్పుగా వేయకపోవడంతో నల్లజర్ల నుంచి దూబచర్ల వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైక్‌పై వెళితే బస్సు,లారీ తప్పించుకునేందుకు మార్గం లేదు. ఒక్క వాహనం మాత్రమే అర కిలో మీటరు మేరు వెళ్లవలసి వస్తోంది. మార్జిన్ లేకుండా పక్కనే పంట కాల్వ ఉండడంతో ప్రమాదాలు జరుగుతునాయి. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారం గడుస్తున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

మినీ గోకులం షెడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం కుమారదేవం, వేములూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్లను శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కుమారదేవంలో గద్దె వాసుదేవ సత్యనారాయణ(రూ.1.15 లక్షలు),గద్దె శ్రీనివాసరావు(రూ.2.3 లక్షలు), వేములూరులో బంబోతు సురేష్ (రూ.2.3 లక్షలు) నిర్మించిన షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీడీవో కె.సుశీల, జడ్పీటీసీ బి.వెంకటలక్ష్మి, వట్టికూటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా ముక్కోటి ఏకాదశి



కొవ్వూరులో ఉత్తర ద్వారంలో వరద గోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- ఉత్తర ద్వారంలో స్వామి దర్శనం
- దర్శనానికి బారులుతీరిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు



ద్వారకాతిరుమల క్షేత్రంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి

కొవ్వూరు, డిసెంబరు 23: ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామిని భక్తులు వైకుంఠ (ఉత్తర) ద్వారంలో దర్శించుకున్నారు. కొవ్వూరులోని పాతవూరులో వరద గోపాలస్వామి ఆలయంలో స్వామిని ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై అలంకరించారు. భక్తులు దర్శించుకునే విధంగా వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం గోపాలస్వామిని గరుడ వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపును మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని ప్రారంభించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావును ఆలయ ఈవో బాలకృష్ణ సత్కరించారు. అలాగే గోష్పాద క్షేత్రం, వేగి వారి చావిడి, టోల్‌గేట్ వద్ద, బసివిరెడ్డి పేటతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి, గోపాలస్వామి ఆలయాలల్లో వైకుంఠ ద్వారా దర్శనాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేకువజాము నుంచి ఉత్తర ద్వారంలో ఆలయాల వద్ద బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు.

పెరవలి: మండలంలోని పలు దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. అన్నవరప్పాడు గ్రామంలో వేంకటేశ్వరస్వామి, తీపర్రులో లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతోపాటు కానూరు, నడిపల్లి, కాకరపర్రు, పెరవలి, అన్నవరప్పాడు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలు: నిడదవోలులో రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారంలో స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తదితర భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

దేవరపల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలో అన్ని దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఉత్తరద్వార దర్శనం, సుప్రభాతసేవ నిర్వహించారు. యర్నగూడెంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



నిడదవోలులో రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి

మండలంలోని అన్ని రామాలయాల్లో శుక్రవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు భజనా కార్య క్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పెరవలి: అన్నవరప్పాడులో పూల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

చాగల్లు: మండలంలోని వేంకటేశ్వరస్వామి, శ్రీరామ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కలుగజేశారు. అలాగే పెద్ద రామాలయంలోను ప్రత్యేక పూజలు చేసి ఉత్తర ద్వార దర్శనం కలిగించారు. ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేత్ర పర్వం.. ఉత్తర ద్వార దర్శనం

ద్వారకా తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వాసుని దివ్య క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది. ముక్కో టి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున సర్వాభరణ భూషితుడై, పుష్పాలంకరణలతో గరుడ వాహనారూఢుడైన చిన్న తిరుమలేశుడు ఉభయ దేవేరులతో కలిసి ఉత్తర ద్వారం వద్ద భక్తులకు సాక్షాత్కరించారు. తెల్లవారు జామున గోవింద దీక్షాదారులు తొలి మెట్టు వద్ద విశేష పూజలు, భజనలు చేశారు. గోవింద నామాన్ని, శంఖు, చక్రాలను కర్పూరంతో తయారుచేసి వాటిని వెలిగించి స్వామి దర్శనానికి వెళ్లారు. ఉత్తర ద్వారాలు తెరుచుకునే శుభ ఘడియలో.. వెండి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుతీరిన ఆ దేవదేవుడు నీరాజనాలు అందుకుంటూ భక్త జన కోటికి దర్శన భాగ్యాన్ని కలుగజేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శ్రీవారిని దర్శించారు. ఉత్తరద్వార దర్శనం తర్వాత దివ్యమూర్తులను పాత సంప్రదాయం ప్రకారం దక్షిణ రాజ గోపురం వద్దకు తీసుకెళ్లడంతో శ్రీవారి పూజా మూర్తులు వెండి శేష వాహనంపై కొలు వుదీరి భక్తులను ఉత్తర ద్వారం వద్ద అభయ ప్రదానం చేశారు. సాయంత్రం వరకూ శ్రీవారు భక్త లకు శేష వాహనంపై ఉండి దర్శన భాగ్యాన్ని కలిగించారు. ఆపై తిరువీధుల్లో ఊరేగించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ డివిజనల్ సమావేశం



ఇసుక ర్యాంపులో రికార్డులో పరిశీలిస్తున్న ఆర్డీవో

కొవ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టులో ఎఫ్‌ఐఆర్ నమోదయిన కేసుల్లో త్వరగా చార్జీషీట్లు వేసి బాధితులకు సత్వర న్యాయం అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. శుక్రవారం కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ డివిజనల్ సమావేశంలో ఆమె డివిజన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులపై సమీక్షించారు. వివిధ సంఘటనలపై 34 కేసులు నమోదయ్యాయన్నారు. కేసులు పురోగతిపై సమీక్ష చేశారు.తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ మోనటరింగ్ కమిటీలో 2024లో నియమించిన నాన్ అఫీషియల్ సభ్యుల పదవీకాలం ముగిసిందని, కొత్తగా సభ్యుల నియామకం చేపట్టాలని సోషల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించామన్నారు. డివిజన్ పరిధిలో 74 మంది గిరిజనులు ఉన్నారు. వారిలో చాగల్లులో ఎక్కువగా 22 కుటుంబాలు ఉన్నాయన్నారు. గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో వారికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయ్ బాబు, పట్టణ సీఐ పి.విశ్వం, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, డివిజన్ పరిధిలోని 9 మండలాల ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇసుక కొరత లేదు

కొవ్వూరులోని ఎరినమ్మ ఇసుక ర్యాంపును ఆర్డీవో సుస్మిత పరిశీలించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో ఎటువంటి ఇసుక కొరత లేదన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని 7 డీసిల్టేషన్ ర్యాంపుల్లో ఔరంగాబాద్ 1, వాడపల్లి ఇసుకర్యాంపులు అధికారులు సూచించిన ఇసుక తవ్వకాలు పూర్తి కావడంతో ఆ ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దండకుంట 1,2, కొవ్వూరు, ఔరంగాబాద్ 2, ఎరినమ్మ ర్యాంపుల్లో ఇచ్చిన క్వాంటిటీ పూర్తికాకపోవడంతో గడువు పొడిగిస్తూ రెన్యూవల్ చేశామన్నారు. కొన్ని ర్యాంపులు జనవరి 31, మరికొన్ని ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించినట్టు చెప్పారు. కొవ్వూరు ర్యాంపులో డిసెంబరు 31 నాటికి 92 మెట్రిక్ టన్నులు ఇంకా తీయాల్సి ఉన్నందున మార్చి 31 వరకు పొడిగించామన్నారు. క్వాంటిటీ పూర్తయిన ర్యాంపుల స్థానంలో ఇరిగేషన్ అధికారుల సూచనలమేరకు కొత్తగా డీసిల్టేషన్ ర్యాంపులు ఇవ్వడం జరుగుతుందన్నారు. తీపర్రు 2,3, పెండ్యాల, పందలపర్రు, వేగేశ్వరపురం ఓపెన్ ర్యాంపుల నుంచి ఇసుక సరఫరా అవుతుందన్నారు. జీడిగుంట ర్యాంపును సీజ్ చేశామని, కుమారదేవంలో కొత్తగా ప్రారంభించామని ఆర్డీవో పేర్కొన్నారు. ఉసులుమర్రు స్టాక్ యార్డులో ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు 59 దరఖాస్తులు

కొవ్వూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మునిసిపాలిటీ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు 59 మంది దరఖాస్తు చేసుకున్నారని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. ప్లంబర్లు 6, కార్పెంటర్లకు 18, ఎలక్ట్రిషియన్‌లకు 17, ఏసీ రిపేరు 2, పెయింటర్ 2, బ్యూటీషియన్ (పురుషులు) 7, బ్యూటీషియన్లు (మహిళలు) ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, మెప్మా సీవోలు జి.కృపారాక్షస్, బి.సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు స్వర్ణ కిరీటం



ఉండ్రాజవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సావరం గ్రామదేవత ముత్యాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తుల విరాళాలతో తయారు చేసిన 650 గ్రాముల బంగారు కిరీటాన్ని శుక్రవారం అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేవారు. స్వర్ణ కిరిటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు. ముత్యాలమ్మను ఎంపీ పురందేశ్వరి దర్శించారు. కె.సావరం, టి.వేమవరం, జంగం చెరువులకు చెందిన జాతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నిడదవోలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న 19 ఏళ్ల యువతి గురువారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి స్వగ్రామం గణపవరం మండలం పిప్పర కాగా సమిశ్రగూడెంలోని బంధువుల ఇంట్లో ఉంటూ నిడదవోలులో బట్టల షాపులో పని చేస్తోందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు

- పలు పాఠశాలల్లో వేడుకలు
- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నిడదవోలులో భోగి వేడుకల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు

కొవ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వివిధ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక సద్గురు పాఠశాలలో ప్రిన్సిపాల్ కంటమణి కీర్తిశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులు, బొమ్మల కొలువుల పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులు ఓటింగ్ పద్ధతిలో విజేతలను ఎంపికచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబు, కరస్పాండెంటు పాలింపాటి వెంకటరత్నం, కం టమణి రఘు పాల్గొన్నారు. మున్సిపల్ హైస్కూల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని కోడ్ నెంబరు 38,44 అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిపారు. చిన్నారులను వివిధ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులు హరిదాసులు, శ్రీకృష్ణుడు, గోపికలు వేషధారణల్లో అలరించారు. పాఠశాల ఆవరణలో వేసిన భోగి మంట చుట్టూ సాంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు ఆటపాటలతో అలరిం చారు. మరోపక్క బొమ్మల కొలువు, గొబ్బెల చుట్టూ చేరి సందడి చేశారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయిని యాంతూ మేరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని చాగల్లు, మార్కొండపాడు ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల వద్ద ప్రీస్కూల్ పిల్లలకు భోగిపళ్లు పోశారు. బొమ్మల కొలువు పెట్టారు. రంగ వల్లులు వేశారు. భోగి మంటలు వేసి హరిదాసు కీర్తనలు పాడించారు. సంక్రాంతిని సంప్రదాయ బద్ధంగా నిర్వహించి చిన్నారులకు తెలియజేశారు. ఐసీడీఎస్ పీవో మమ్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.శిరీష, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సద్గురు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న కంఠమణి రమేష్, కీర్తిశ్రీ

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా ఉండాలంటే క్రీడలపై దృషి సారించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో కోడిపందేలు, జూదం వద్దు ఆటపాటలే ముద్దు అంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పోటీలు నిర్వహించుకోవాలన్నారు. ఈ ఏడాది వేళ్లచింతలగూడెంలో జరిగే సంక్రాంతి సంబరాలు రాష్ట్రానికే తలమానికం కావాలన్నారు. అలాగే కోడిపందేలు, జూదంపై ఉక్కుపాదం మోపాలంటూ గోపాలపురంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అజయ్‌బాబు వీఆర్వోలు సచివాల య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. కోడి పందేలు, గుండాట, పేకాట వంటివి ఏర్పాటు చేసేందుకు బరులు నిర్వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ సీఐ పి.నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ సతీష్‌కుమార్, సంక్రాంతి సంబరాల కమిటీ ప్రతినిధులు కె.రాము, పి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహించరాదు

ఉండ్రాజవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు, పాలంగి, సత్యవాడ తదితర గ్రామపంచాయతీల్లో శుక్రవారం కోడిపందేల నిషేధంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు మాట్లాడుతూ కోడిపందేల వల్ల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయని, వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. సమావేశాల్లో సర్పంచ్‌లు కరుటూరి నరేంద్రబాబు, బొక్కా శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శులు మునసలయ్య, ఎమ్‌డీ హసన్‌జాని, జి.ప్రసాదరావు, వీఆర్వోలు జె.లక్ష్మీనరసమ్మ, చిట్టిబాబు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు

చాగల్లు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల పేరుతో జూద క్రీడలు నిర్వహిస్తే ఖఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.నరేంద్ర ఓ ప్రకటనలో హెచ్చరించారు. ముందు జాగ్రత్తగా మండలంలో 58 మందిని బైండోవర్ చేసినట్టు చెప్పారు. నిబంధనలు అతిక్రమించి అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు, పేకాట, కోడి పందేలు, గుండాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

తాళ్లపూడిలో షటిల్ టోర్నమెంట్

తాళ్లపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తాళ్లపూడి ఆధ్వర్యంలో నేషనల్ కోచ్ నాగులకొండ వీరభద్రం పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను తహశీల్దార్ బీరా రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఆర్యవైశ్య ప్రముఖుడు సింహాద్రి జనార్దనరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తాళ్లపూడి, గోపాలపురం, పోలవరం రాజమహేంద్రవరం, కొవ్వూరు మండలాల నుంచి 60 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని పండుగ రోజుల్లో జూదాలకు తావివ్వకుండా ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహిస్తున్న అసోసియేషన్‌కు అభినందనలు తెలిపారు.